# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 270 శుక్రవారం 26 ఏప్రిల్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# రిజర్వేషన్ల రద్దే బీజేపీ ఎజెండా

- సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర చేస్తోంది
- పదేళ్ల ఎన్డీయే పాలనపై గాంధీభవన్‌లో చార్జ్ షీట్ విడుదల చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేసి ఎలాగైనా గెలవాలని బీజేపీ చూస్తోందన్న రేవంత్
- కార్పొరేట్ శక్తులకు మోదీ సర్కార్ లొంగి పనిచేస్తుంది
- రిజర్వేషన్ల రద్దు.. బీజేపీ విధానం
- రిజర్వేషన్లు కావాలా?.. వద్దా? అనేదానికి ఈ ఎన్నికలే రెఫరెండం

హైదరాబాద్

దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల రద్దుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పై దుష్ప్రచారం చేసి ఎలాగైనా గెలవాలని బీజేపీ చూస్తోందని అన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే పాలనపై గురువారం గాంధీభవన్ లో చార్జ్ షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...మోదీ సర్కార్ దేశంలోని కార్పొరేట్ సంస్థలకు లొంగిపోయి పనిచేస్తుందన్నారు. గత ప్రధానులందరూ కలిసి రూ.54 లక్షల కోట్ల అప్పులు చేస్తే ప్రధాని మోదీ మాత్రం రూ.113 లక్షల కోట్లు అప్పులు చేశారని చెప్పారు. రైతుల పోరాటంతో నల్ల చట్టాలను ప్రధాని మోదీ వెనక్కి తీసుకున్నారు. అనంతరం, పార్లమెంట్ సాక్షిగా రైతులకు క్షమాపణ చెప్పాల్సి వచ్చిందని సీఎం రేవంత్ గుర్తు -మిగతా3లో



## ప్రధాని మోదీ, రాహుల్‌కు ఈసీ నోటీసులు..

- ఏప్రిల్ 29 లోపు వివరణ ఇవ్వాలని ఆదేశం
- ఎన్నికల కోడ్‌ను మోదీ, రాహుల్ ఉల్లంఘించినందుకు నోటీసులు
- ప్రచారంలో భాగంగా విద్వేషపూరిత ఆరోపణలు, విమర్శలు చేస్తూ ప్రసంగం

## 17 లోక్ సభ స్థానాలకు 547 నామినేషన్లు

- రేపు నామినేషన్ల ప్రక్రియ... 29వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు
- మే 13న పోలింగ్, జూన్ 4న ఎన్నికల ఫలితాలు
- ఉమ్మడి నల్గొండ జిల్లాలోని రెండు లోక్ సభ స్థానాలకు 120కి పైగా నామినేషన్లు



## తెలంగాణలో మరో ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఉప ఎన్నిక
- మే 2వ తేదీన ఈసీ నోటిఫికేషన్ విడుదల.
- మే 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ.
- మే13న నామినేషన్ ఉపసంహరణకు చివరి తేదీ.






## పాట్నాలో భారీ అగ్ని ప్రమాదం

- ఆరుగురి సజీవ దహనం
- మరో 30 మందికి పైగా గాయాలు
- గ్యాస్ సిలిండర్ పేలుడు వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు
- క్షతగాత్రులను చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించిన పోలీసులు
- బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్న సీఎం నితీష్ కుమార్

## యాత్రలో జనసమీకరణపై మల్లాగుల్లాలు

- రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేయాలని డిసైడ్ అయ్యారు కేసీఆర్
- పార్లమెంట్ నియోజకవర్గాల్లో బస్సు యాత్రకు శ్రీకారం చుట్టేందుకు సన్నద్ధం
- ఎన్నికల్లో పోటీకి కొత్తవారికి అవకాశం ఇవ్వడంతో గుర్రుగా ఉన్న సీనియర్లు
- ఇప్పటికే కొంతమంది పెట్టెబేడా సర్దేసుకుని కాంగ్రెస్‌లో చేరిన నాయకులు
- లోలోన రగిలిపోతున్న ఉన్న ఆ కొందరు నేతలు
- ఇప్పుడు వాళ్లంతా కోవర్టులుగా పనిచేయాలని భావిస్తున్నట్లు టాక్.
- పార్టీలో ఉన్న ఒకరితో ఒకరికి గిట్టక గ్రూపులు కడుతున్న మరికొందరు నేతలు



హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికలకు మరో 3 వారాల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేయాలని డిసైడ్ అయ్యారు కేసీఆర్. పార్లమెంట్ నియోజకవర్గాల్లో బస్సు యాత్రకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. కానీ, ఆదిలోనే అడ్డంకి ఏర్పడింది. లోక్ సభ ఎన్నికల ప్రచారంపై కేసీఆర్ అంత ఆసక్తిగా లేనట్లుగా కనిపిస్తోంది. ప్రతీ ఎన్నికలకు ముందు భారీ బహిరంగసభ పెట్టి నగారా మోగించే ఆయన ఈ పార్లమెంట్ ఎన్నికలకు బస్సు యాత్రతో సరిపెడుతున్నారు. దాన్ని కూడా వీలైనంత ఆలస్యంగా చేస్తున్నారు. సోమవారం నుంచి యాత్ర ప్రారంభించాలనుకున్నారు కానీ.. రెండు రోజుల వాయిదా తర్వాత ప్రారంభిస్తున్నట్లుగా తెలిపారు. మే 11వ తేదీ సాయంత్రానికి ప్రచార -మిగతా3లో



## మా మేనిఫెస్టోను చదవండి

- ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే లేఖ
- మీ సొంత వ్యక్తులు కొట్టే చప్పట్లను చూసి మోసపోవద్దని మోదీకి హెచ్చరిక
- మా మేనిఫెస్టోలో చేర్చని అంశాల గురించి మీ సలహాదారులు మీకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని వ్యాఖ్య
- మా న్యాయపత్రాన్ని వివరించేందుకు వ్యక్తిగత భేటీకి సిద్ధమన్న ఖర్గే

# తెలంగాణను ఢిల్లీ ఏటీఎంగా మార్చారు



- కాంగ్రెస్ నేతలపై షా ఫైర్!
- 12 లోక్‌సభ స్థానాల్లో బీజేపీని గెలిపించండి
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా.
- దేశవ్యాప్తంగా 400కు పైగా స్థానాల్లో కమలాన్ని వికసింపజేయాలి
- కోర్టు వివాదంలో గెలిచి.. అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి మోదీ కృషి చేశారు
- కశ్మీర్‌ను భారత్‌లో శాశ్వతంగా అంతర్భాగం చేయాలన్న పట్టుదలతో ముందుకెళ్తున్నారు
- మోదీని మూడోసారి ప్రధానిని చేస్తే అవినీతి అంతానికి కృషి చేస్తామని హామీ
- తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాల్సి ఉంది

సిద్దిపేట

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు మరో పక్షం రోజుల సమయమే ఉండడంతో బీజేపీ అగ్ర నాయకత్వం తెలంగాణపై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ బహిరంగ సభలు, రోడ్డు షోలు, వీధి సమావేశాలు, ఇంటింటి ప్రచారం ఉధృతం చేసింది. ఆయా సభలు, రోడ్డు షోల్లో పాల్గొనేందుకు బీజేపీ అగ్ర నాయకత్వం తరలివస్తోంది. మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా సిద్దిపేట సభలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేంద్ర మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై -మిగతా3లో



## రెండు రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పేపర్ ప్రకటన

- కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రఘోష్ కీలక వ్యాఖ్యలు
- నిర్మాణ సంస్థలతో పాటు అవసరమైతే నేతలకు నోటీసులు ఇస్తామని వెల్లడి
- అవసరమైతే కేసీఆర్‌ను పిలిచి ఈ ప్రాజెక్టుపై కావాల్సిన సమాచారం సేకరిస్తామని స్పష్టీకరణ
- నివేదికల ఆధారంగా, టెక్నికల్ అంశాలను పరిగణనలోకి తీసుకొని విచారిస్తామన్న కాళేశ్వరం కమిషన్ చైర్మన్

# పాట్నాలో భారీ అగ్నిప్రమాదం

**పాట్నా:** బిహార్ రాజధాని పాట్నాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. పాట్నా జంక్షన్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. పలువురు గాయపడగా.. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. పాట్నాలోని రైల్వే జంక్షన్ వద్ద హోటల్‌లో మంటలు చెలరేగినట్లు ఉదయం 11 గంటలకు తమకు సమాచారం అందినట్లు అగ్నిమాపక శాఖ డీఐజీ మృత్యుంజయ్ కుమార్ తెలిపారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. హోటల్ నుంచి సుమారుగా 30 మందిని కాపాడినట్లు తెలిపారు. సిలిండర్ పేలడంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.




అగ్ని ప్రమాద సమాచారాన్ని అందుకున్న అగ్నిమాపక శాఖ వెంటనే సిబ్బందితో అక్కడకు చేరుకుని సుమారు రెండుగంటలపాటు శ్రమించి మంటల్ని అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. ప్రమాదంలో మరణించిన వారి వివరాలు ఇంకా తెలియరాలేదు. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే అగ్ని ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. కాగా, అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నితీష్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# ప్రపంచంలోనే లోతైన బోర్? ఆత్మల ఘోష తట్టుకోలేక మూసేశారట!

**రష్యాలోని కోలా ప్రాంతంలో 12.2 కిలోమీటర్ల లోతు వరకు తవ్విన బోర్ వెల్**

**భూమ్మీద మనుషులు చేసిన రంధ్రాల్లో ఇదే అతి లోతైనది**

**అంత లోతున అత్యంత వేడి వల్ల డ్రిల్లింగ్ నిలిపివేత**

అది ప్రపంచంలోనే అత్యంత లోతైన బోర్ వెల్.. లోతు ఏకంగా 12 కిలోమీటర్ల 262 మీటర్లు. రష్యాలోని కోలా ప్రాంతంలో ఉంది. కానీ దానిని మూసేశారు. ఇంత లోతుగా బోర్ తవ్వడానికి, అంత లోతున తవ్వాక ఆపేయడానికి.. చివరికి మూసేయడానికి వెనుక కారణాలు కూడా చిత్రమే.

**అంత లోతు బోర్ ఎందుకు తవ్వారు?**

1970వ దశకం సమయంలో అమెరికా, రష్యా (అప్పటి యూఎస్ఎస్ఆర్) మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. నేనంటే నేను గొప్ప అన్నట్టుగా ప్రతి అంశంలో పోటీ సాగుతోంది. అలాంటి సమయంలో భూమిలో అత్యంత లోతు బోర్ తవ్వేందుకు రష్యా రెడీ అయింది. కేవలం పోటీ అనే కాకుండా భూమిలోపలి పొరల పరిస్థితులు, ఇతర పరిశోధనలకూ పనికొస్తుందని భావించింది. అలా ఏకంగా 12 కిలోమీటర్ల 262 మీటర్ల లోతు వరకు తవ్వింది.

**ఆ లోతున ఎందుకు ఆపేశారు?**


భూమి లోపలికి వెళ్తున్న కొద్దీ ఉష్ణోగ్రతలు పెరిగిపోతూ ఉంటాయి. అలా ఈ బోర్ వెల్ అడుగున ఏకంగా 180 డిగ్రీల ఉష్ణోగ్రత తగిలింది. బోర్ వేసే పరికరాలు దెబ్బతినడం మొదలైంది. దాంతో బోర్ వేయడం ఆపేశారు.

**మరి మూసేయడం ఎందుకు?**



బోర్ వేసిన తర్వాత కొన్నాళ్ల నుంచి ఆ ప్రాంతానికి సమీపంలో ఉండే ప్రజలు అధికారులకు కంప్లైంట్లు చేయడం మొదలుపెట్టారు. నరకంలో చిత్రహింసలకు గురవుతున్న ఆత్మలు చేస్తున్న ఘోషలు, అరుపులు ఆ బోర్ నుంచి వినిపిస్తున్నట్టు చెప్పారు. అక్కడి వారు భూమి దిగువన నరకం ఉంటుందని నమ్ముతారు. అందుకే నరకం నుంచి ఆత్మల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయని భావించారు. దీనికితోడు.. ఆ బోర్ వెల్ కు సంబంధించిన పరిశోధనలు కూడా పూర్తవడంతో.. రష్యా ఆ బోర్ వెల్ ను మూసేసింది. మూసివేయడం అంటే మట్టితో పూడ్చేయడం కాకుండా.. దాన్ని పైపులు అమర్చి, బోల్టులతో బిగించేసింది. దానిపైన ఓ చిన్న కట్టడాన్ని నిర్మించింది.

## కాంగ్రెస్ ఓబీసీల హక్కులను కాలరాసింది



దేశంలోని ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీల హక్కులను కాలేరాసే కుట్రకు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆరోపించారు. యూపీలోని ఆగ్రాలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీల హక్కులను లాగేసుకుందని, ఆపై దేశవ్యాప్తంగా ఎక్కడ అధికారంలోకి వచ్చినా ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలను వంచించేందుకు అలాగే చేయాలని భావిస్తోందని ఆరోపించారు. కర్నాటకలో ముస్లింలందరినీ ఓబీసీ జాబితాలో చేర్చుతూ అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రికి రాత్రి నిర్ణయం తీసుకుందని వివరంచారు. కాంగ్రెస్ ఓబీసీల హక్కులను కాలరాసిందని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. యూపీలోనూ ఈ క్రీడను రక్తికట్టించేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోందని దుయ్యబట్టారు. దేశంలో ఎక్కడ అవకాశం వచ్చినా కాంగ్రెస్ ఈ పనికి తెగబడుతుందని అన్నారు. దొడ్డిదారిన ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు కోతలు పెట్టి దాన్ని ఇతరులకు బీజేపీ అందిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఈ క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ పూర్తిగా వత్తాసు పలుకుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# మా మేనిఫెస్టోను చదవండి

ప్రధాని నరేంద్ర మోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ లేఖ రాశారు. సంపద పునఃపంపిణీ, మంగళసూత్రం, వారసత్వ పన్నుపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ, బీజేపీ నేతలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రధాని మోదీ ఈ పదాలను ఉపయోగించి కాంగ్రెస్‌కు చురకలు అంటిస్తున్నారు. ఈ నేపథ్యంలో చప్పట్లకు మోసపోవద్దని ఖర్గే... మోదీకి లేఖ రాశారు. ఇటీవల మీ సభలలో మీ భాష విని నేనేమీ ఆశ్చర్యపోలేదని... కానీ మీ సొంత వ్యక్తులు కొట్టే చప్పట్లను చూసి మాత్రం మోసపోవద్దని మోదీని హెచ్చరించారు. మీ మాటలతో నిరాశకు గురైన కోట్లాదిమంది ప్రజల అభిప్రాయాలను మీ దరి చేరనివ్వడం లేదని విమర్శించారు. మా మేనిఫెస్టోలో చేర్చని అంశాల గురించి మీ సలహాదారులు మీకు తప్పుడు సమాచారం ఇస్తున్నారంటూ పేర్కొన్నారు. మా న్యాయపత్రాన్ని వివరించేందుకు మీతో వ్యక్తిగత భేటీకి తాను సిద్ధమేనని... అందుకు సంతోషిస్తానని పేర్కొన్నారు. అప్పుడు కానీ దేశ ప్రధానిగా మీరు తప్పుడు ప్రకటనలు చేయరని నేను భావిస్తున్నానని ఖర్గే పేర్కొన్నారు. మీ సూట్ బూట్ సర్కార్ కార్పోరేట్ రంగంలోని వ్యక్తుల కోసమే పని చేస్తోందని విమర్శించారు. వారి పన్నులను తగ్గించారని... వారు రీఫండ్స్ పొందుతున్నారన్నారు. మరోవైపు ఉద్యోగులు అధిక



మొత్తంలో పన్నులు చెల్లిస్తున్నారన్నారు. పేదలు చివరకు ఉప్పుపై కూడా జీఎస్టీ చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేం పేద, ధనిక వర్గాల గురించి మాట్లాడుతుంటే మీరేమో హిందూ, ముస్లిం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. మీరు మంగళసూత్రం గురించి మాట్లాడుతున్నారని... కానీ మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలకు కారణమెవరు? అని ప్రశ్నించారు. ఓ వైపు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వారి భార్యాపిల్లలను ఎలా రక్షించాలి? మా మేనిఫెస్టో చదివితే తెలుస్తుందన్నారు.

## వృద్ధుల మద్దతు లేకుంటే గల్లంతే?

దేశంలో లోక్‌సభ ఎ?న్నికల సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో పలు ఆసక్తికర ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. యూపీలోని బల్లియా, సేలంపూర్, ఘోసీ నియోజకవర్గాల అభ్యర్థులు ఎంపీలు కావాలంటే వారికి వృద్ధ ఓటర్ల ఆశీస్సులు తప్పనిసరిగా మారాయి. బల్లియాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 4,89,977 మంది వృద్ధ ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో ఈ వీరు 19.51 శాతం. బల్లియా లోక్‌సభ స్థానానికి బీజేపీ, బీఎస్పీ తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించాయి. అయితే ఎస్పీ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. సేలంపూర్‌లో ఎస్పీ, బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టాయి. అయితే బీఎస్పీ ఇంకా తన అభ్యర్థిని నిర్ణయించలేదు. ఘోసీలో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సుభాష్ ఎన్నికల బరిలోకి దిగగా, ఎస్పీ, బీఎస్పీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఈ మూడు



స్థానాల నుంచి ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల విజయానికి వృద్ధ ఓటర్ల ఆశీస్సులే కీలకం కానున్నాయి. వృద్ధ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుగుణంగా ఎన్నికల సంఘం పలు ఏర్పాట్లు చేసింది. 85 ఏళ్లు పైబడిన ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం అందుబాటులో ఉంచారు. బల్లియాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 ఏళ్లు పైబడిన ఓటర్లు 1104 మంది ఉన్నారు. బన్సీ అసెంబ్లీలో అత్యధికంగా 361 మంది ఓటర్లు ఉన్నారు. బైరియా అసెంబ్లీలో 349, బెల్తారాడ్ అసెంబ్లీలో 151, రాస్రాలో 134, సికందర్‌పూర్‌లో 48, ఫెఫ్నాలో 37, బల్లియా నగర్‌లో 23 మంది ఓటర్లు 100 ఏళ్లు దాటినవారున్నారు.


## ప్రధాని మోదీ, రాహుల్‌కు ఈసీ నోటీసులు..



**ఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల వేళ విద్వేష ప్రసంగాల వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం యాక్షన్ తీసుకుంది. బీజేపీ, కాంగ్రెస్ ఫిర్యాదులపై ఎన్నికల సంఘం విచారణ చేపట్టింది. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలకు గురువారం నోటీసులు జారీ చేసింది. ఎన్నికల కోడ్‌ను మోదీ, రాహుల్ ఉల్లంఘించినందుకు నోటీసులు ఇచ్చినట్లు ఈసీ పేర్కొంది. ఏప్రిల్ 29, ఉదయం 11 గంటల లోపు ఇరువురు నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ చేసిన ప్రసంగాలపై వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.


ఈ ఇద్దరు నేతలు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా విద్వేషపూరిత ఆరోపణలు, విమర్శలు చేస్తూ ప్రసంగించారు. ఈ వ్యవహారంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ చీఫ్‌ను ఈసీ వివరణ కోరింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా పార్టీ అధ్యక్షులే జాగ్రత్త వహించాలని పేర్కొంది.

## మురుగు నదిలో స్నానం చేసిన ఎంపీ అభ్యర్థి.. పెద్ద కారణమే



**భోపాల్:** ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు నిరసనలు తెలపడం సహజమే. అందరికి భిన్నంగా కొందరు వినూత్నంగా నిరసనలు తెలుపుతారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కూడా సమస్య పరిష్కారానికి డిమాండ్ చేస్తూ.. వినూత్నంగా నిరసన తెలిపారు. సంబంధిత వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. మధ్యప్రదేశ్‌లోని ప్రధాన నదుల్లో షిప్రా ఒకటి. ఈ నదితో లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. తాగునీటిని కూడా అందిస్తున్నారు. అయితే నదీ తీరంలో పరిశ్రమలు, పట్టణాలు వెలియడం.. అవి వెదజల్లే కలుషితాలను నదిలోకే వదిలేయడంతో నీరు దుర్గంధభరితంగా మారుతోంది. దీంతో ఆ నీరు ఎందుకు పనికి రాకుండా.. సముద్రంలో కలుస్తున్నాయి. ఈ సమస్యపై అధికార బీజేపీకి ఎన్ని సార్లు విన్నవించిన పట్టించుకోవట్లేదని కాంగ్రెస్ అంటోంది. ఈ క్రమంలో ఉజ్జయిని లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న మహేశ్ పర్మార్.. ప్రభుత్వానికి వినూత్న రీతిలో నిరసన తెలియజేయాలి అనుకున్నారు. తొలుత కలుషిత నీరు వస్తున్న కాలువలో కూర్చున్నారు. అనంతరం నదిలోకి దిగి స్నానం చేసి.. ప్రభుత్వానికి నిరసనను తెలియజేశారు. ఎన్నికలు వచ్చినప్పుడే బీజేపీ నదిని శుభ్రం చేయిస్తామని హామీ ఇస్తుందని.. తరువాత పట్టించుకోదని మహేశ్ ఆరోపించారు. షిప్రా నదిలోకి కలుషితాలు కలవకుండా అరికట్టాలని.. నది స్వచ్ఛతను కాపాడాలని ప్రభుత్వానికి విన్నవించారు. షిప్రా నది పరిశుభ్రత కోసం ఉజ్జయిని ప్రజలు పోరాడాలని మహేష్ కోరారు."గత 10 ఏళ్లుగా కేంద్రంలో, మధ్యప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంది. పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలకు నది కాలుష్యంపై ఎన్నిసార్లు వివరించినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అభివృద్ధి గురించి మాట్లాడే బీజేపీ ఇంత జరుగుతున్నా పట్టించుకోకపోవడం ఏంటి" అని మహేశ్ పర్మార్ ప్రశ్నించారు. ఉజ్జయిని బీజేపీ సిట్టింగ్ ఎంపీ అనిల్ ఫిరోజియాతో.. కాంగ్రెస్ అభ్యర్థి పర్మార్ తలపడనున్నారు. మధ్యప్రదేశ్‌లోని లోక్‌సభ స్థానాలకు నాలుగు దశల్లో పోలింగ్ జరగనుంది. తదుపరి మూడు దశల ఓటింగ్ ఏప్రిల్ 26, మే 7, మే 13 తేదీల్లో జరుగుతాయి. మే 13న ఉజ్జయినిలో పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడికానున్నాయి. మధ్యప్రదేశ్‌లో మొత్తం 29 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. దిగువ సభకు పంపే సభ్యుల పరంగా ఇది ఆరో అతిపెద్ద రాష్ట్రం. వీటిలో 10 సీట్లు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రిజర్వ్ కాగా, మిగిలిన 19 అన్ రిజర్వ్‌డ్‌గా ఉన్నాయి

## నాలుగేళ్లలో 527 ఆహార ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలు'



భారత బ్రాండ్లైన ఎవరెస్ట్, ఎండీహెచ్ ఉత్పత్తుల్లో ఇథిలీన్ ఆక్సైడ్ అనే క్యాన్సర్ కారకం ఉందని యూరోపియన్ ఫుడ్ సేఫ్టీ అథారిటీ (ఈఎఫ్ఎస్ఏ) గుర్తించింది. దాంతో హాంకాంగ్, సింగపూర్‌ల్లో వాటి ఉత్పత్తులపై నిషేధం విధించినట్లు వార్తలు వచ్చాయి. అయితే 2020 సెప్టెంబర్ నుంచి 2024 ఏప్రిల్ మధ్యకాలంలో ఇండియాలో తయారైన దాదాపు 527 ఆహార ఉత్పత్తుల్లో క్యాన్సర్‌కు దారితేసే కారకాలు ఉన్నట్లు రాపిడ్ అలర్ట్ సిస్టమ్ ఫర్ ఫుడ్ అండ్ ఫీడ్ (ఆర్ఏఎస్ఎఫ్ఎఫ్) డేటా ప్రకారం నిర్ధారణ అయినట్లు ఈఎఫ్ఎస్ఏ అధికారులు తెలిపారు. ఈ 527 ఉత్పత్తుల్లో ఇప్పటికే 87 సరుకులను ఇతర దేశాలు తిరస్కరించినట్లు కొన్ని మీడియా కథనాల ద్వారా తెలిసింది. అయితే వీటిలో 332 ఉత్పత్తుల్లో భారత్‌లోనే తయారైన హానికర రసాయనాలను వినియోగించినల్లు తేలింది. కానీ మిగతావాటిలో వాడిన రసయనాలు ఎక్కడివో తెలియాల్సి ఉంది. ఇథిలీన్ ఆక్సైడ్ వాస్తవానికి వైద్య పరికరాలపై క్రిములను చంపడానికి, వాటిని శుభ్రం చేయడానికి వాడుతారు. పురుగుమందు, స్టెరిలైజింగ్ ఏజెంట్‌గా వినియోగిస్తారు. దీన్ని ఆహార ఉత్పత్తుల్లో వాడడంతో లింఫోమా, లుకేమియా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తేలింది. రామయ్య అడ్వాన్స్‌డ్ టెస్టింగ్ ల్యాబ్స్‌లోని చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జుబిన్ జార్జ్ జోసెఫ్ ఇథిలీన్ ఆక్సైడ్ ఉప ఉత్పత్తుల వల్ల కలిగే ప్రమాదాల గురించి తెలిపారు. ఇథిలీన్ ఆక్సైడ్ ఉప ఉత్పత్తి అయిన ఇథిలీన్ గ్లైకాల్ చాలా ప్రమాదమని చెప్పారు. దీన్ని గతంలో దగ్గు సిరప్‌ల్లో వాడడం వల్ల ఆఫ్రికాలో మరణాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ఇప్పటికే ఇథిలీన్ ఆక్సైడ్ కలిగిన ఆహార పదార్థాలను తీసుకున్న వారికి గామా కిరణాలతో చికిత్స అందించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వంటి ప్రభుత్వ సంస్థలు అధ్యయనాలు నిర్వహించాలని కోరారు.

# రిజర్వేషన్ల రద్దే బీజేపీ ఎజెండా

-మొదటి పేజి తరువాయి

చేశారు. అలాగే, అగ్గి పెట్టె, సబ్బు బిల్ల, అగర్ బత్తీలపై కూడా మోదీ జీఎస్టీ విధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
కాగా, గాంధీభవన్‌లో బీజేపీపై ఛార్జ్‌షీట్ విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ..'పదేళ్ల బీజేపీ వైఫల్యాలు, కుట్రలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మాపై ఉంది. 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ పదేళ్లలో కేవలం ఏడు లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. రైతుల పోరాటంతో నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న మోదీ.. పార్లమెంట్ సాక్షిగా రైతులకు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది.
ఆర్ఎస్ఎస్ అజెండాను బీజేపీ అమలు పరిచిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. డబుల్ ఇంజిన్ పేరిట దేశాన్ని బీజేపీ దోచుకుంటుందన్నారు. 60 లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ రంగ ఆస్తులను కేవలం 6 లక్షల కోట్ల రూపాయలకు కార్పొరేట్ కంపెనీలకు బీజేపీ తెగనమ్మిందని రేవంత్ విమర్శించారు. చార్జ్ షీట్ పోస్టర్ విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటుగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జ్ దీపాదాస్ మున్షీ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.
బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తోంది. చేనేత నుంచి కుటీర పరిశ్రమల వరకు జీఎస్టీ పేరుతో దోపిడీకి పాల్పడుతోంది. అగ్గి పెట్టె, సబ్బు బిల్ల, అగర్ బత్తీలపై కూడా మోదీ జీఎస్టీ విధించారు. దేశ ప్రజలపై రూ.168 లక్షల కోట్ల అప్పుల భారం మోపారు. పదేళ్లలో రూ.113 లక్షల కోట్లు అప్పులు తెచ్చి భారత దేశాన్ని తాకట్టు పెట్టారు. 60 ఏళ్లు కాంగ్రెస్ కూడబెట్టిన ఆస్తులను మోదీ పదేళ్లలో కార్పొరేట్లకు కట్టబెట్టారు.
ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై బీజేపీ కుట్ర చేస్తోంది. రిజర్వేషన్లు రద్దు చేయడమే బీజేపీ ఎజెండా. ఆర్ఎస్ఎస్ విధానాన్ని బీజేపీ అమలు చేస్తోంది. రిజర్వేషన్ల రద్దు కోసమే 400 సీట్ల మెజారిటీ సాధించాలని ప్రయత్నిస్తున్నారు. 2025లోగా రిజర్వేషన్లను రద్దు చేయాలనే విధానంతో ఆర్ఎస్ఎస్ ఉంది. మొండిగా వ్యవహరించి అయినా సరే రిజర్వేషన్లు రద్దు చేయాలని మోదీ కుట్ర చేస్తున్నారు. ఇందుకు 2/3వ వంతు మెజారిటీ సాధించాలని పన్నాగాలు పన్నుతున్నారు..
జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్ గాంధీ స్పష్టంగా ప్రకటించారు. అందుకే దీన్ని అడ్డుకునేందుకు బీజేపీ కుట్ర చేస్తోంది. కాంగ్రెస్‌పై విష ప్రచారం చేసి ఎలాగైనా గెలిచి రిజర్వేషన్లు రద్దు చేయాలని



చూస్తున్నారు. బీజేపీకి వేసే ప్రతీ ఓటు రిజర్వేషన్ల రద్దుకు వేసినట్లే. వర్గీకరణ కోసం కొట్లాడిన వారు కూడా ఇప్పుడు బీజేపీకి ఎందుకు మద్దతు ఇస్తున్నారో తెలియడం లేదు. రిజర్వేషన్లు వద్దు.. రిజర్వేషన్లు రద్దు అనుకుంటే మీరు బీజేపీకి మద్దతు ప్రకటించండి. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ వైపు నిలబడొద్దు. ఈ ఎన్నికలు రిజర్వేషన్లు వర్సెస్ రిజర్వేషన్లు రద్దుగా జరగబోతున్నాయి' అని కామెంట్స్ చేశారు
దేవుడి పేరు చెప్పే బీజేపీ అగరబత్తీలపై కూడా జీఎస్టీ వేశారు
ఆర్ఎస్ఎస్ భావజాలం, బీజేపీ విధానం రిజర్వేషన్లు రద్దు చేయడమే అని.. ఆర్ఎస్ఎస్ ఆలోచనను దేశంపై రుద్దాలనే కుట్ర చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... రిజర్వేషన్లు రద్దు కోసం మోదీ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వంద సంవత్సరాల్లో రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఆర్ఎస్ఎస్ కంకణం కట్టుకుందన్నారు. తమకి మెజారిటీ వస్తే రిజర్వేషన్లు తీసేయడం సులభమని మోదీ అనుకుంటున్నారని... ప్రధాని దేశాన్ని మోసం చేశారని దుయ్యబట్టారు. డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధాని అంటూ వ్యాఖ్యలు చేశారు. పదేండ్లలో కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు.
ఆ 14 మంది కంటే మోదీ చేసిన అప్పులే ఎక్కువ...
పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని కేవలం 7 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు. పదేండ్ల మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. నల్లధనం తెస్తానన్న మోదీ పది పైసలు కూడా తేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 55 రూపాయల పెట్రోల్.. మోదీ వచ్చాక రూ.110 చేశారన్నారు. జీఎస్టీ పేరుతో మోదీ దోపిడీ చేశారని మండిపడ్డారు. దేవుడి పేరు చెప్పే బీజేపీ అగరబత్తీలపై కూడా జీఎస్టీ వేశారన్నారు. చిన్న పిల్లల పెన్సిల్, రబ్బర్లపై కూడా జీఎస్టీ వేశారంటూ ఆగ్రహించారు. 14 మంది ప్రధాన మంత్రులు చేసిన అప్పుల కంటే.. మోదీ ఒక్కడే డబుల్ అప్పులు చేశారన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు అన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అమ్మేశారన్నారు. దేశాన్ని తప్పకుండా ఎక్స్ రే తీస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారు.
ఓబీసీ రిజర్వేషన్లు 27 శాతాన్ని 50 శాతానికి పెంచుతారనేదే బీజేపీ భయమన్నారు. మండల్ ఉద్యమానికి వ్యతిరేకంగా బీజేపీ కమండల్ ఉద్యమాన్ని తెచ్చిందన్నారు. బీజేపీకి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్లు తీసేయడానికి ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. కొందరు స్థానిక రాజకీయాల కోసం రిజర్వేషన్లు తీసేయడానికి సిద్ధమైన బీజేపీకి మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్లు కావాలా? వద్దా అనే దానికి ఈ ఎన్నికలు రెఫరెండమని తెలిపారు. రిజర్వేషన్లు ఉండాలి అనేవాళ్ళు కాంగ్రెస్‌కు ఓటేయాలని.. వద్దు అనేవాళు ్ళ బీజేపీకి ఓటేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణను ఢిల్లీ ఏటీఎంగా మార్చారు..

-మొదటి పేజి తరువాయి

తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.
తెలంగాణలో కనీసం 12 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా. మరోసారి నరేంద్ర మోదీని ప్రధానిని చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా 400కు పైగా స్థానాల్లో కమలాన్ని వికసింపజేయాలని కోరారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు.
సిద్ధిపేట జిల్లా కేంద్రం డిగ్రీ కాలేజీ మైదానంలో 'బీజేపీ విశాల జన సభ' లో అమిత్ షా మాట్లాడుతూ..' గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కోర్టు వివాదంలో గెలిచి.. అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి మోదీ కృషి చేశారన్నారు. కశ్మీర్‌ను భారత్‌లో శాశ్వతంగా అంతర్భాగం చేయాలన్న పట్టుదలతో ముందుకెళు తున్నారని తెలిపారు.. మోదీని మూడోసారి ప్రధానిని చేస్తే అవినీతి అంతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాల్సి ఉందన్న అమిత్ షా.. మజ్లిస్‌కు భయపడటం వల్లే బీఆర్ఎస్, కాంగ్రెస్ నిర్వహించడం లేదని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కచ్చితంగా నిర్వహిస్తామని చెప్పారు.



మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్ట్ పేరుతో గ్రామాలు ఖాళీ చేయించిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, బీర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిదేనని విమర్శించారు రఘునందన్ రావు. కేసీఆర్ కాళ్ళు మొక్కినందుకు వెంకట్రామిరెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చాడని మండిపడ్డారు. 3 సంవత్సరం కాలంలో నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వని ఆయన.. ఇప్పుడు100 కోట్ల రూపాయల పెట్టి అభివృద్ధి చేస్తా అని చెప్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడుగులకు మడుగులు వత్తే అధికారులు లేక హరీష్ రావు సిద్దిపేట నియోజకవర్గంలో పర్యటించడం లేదని విమర్శించారు.

**అంతా మోదీనే చేస్తున్నారు!**

కశ్మీర్‌ను భారత్‌లో శాశ్వతంగా అంతర్భాగం చేసేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు. తెలంగాణలో 12 స్థానాల్లో బీజేపీని గెలిపించాలి. అయోధ్యలో రామమందిరం కోసం మోదీ కృషి చేశారు. మజ్లిస్‌కు భయపడటం వల్లే బీఆర్ఎస్, కాంగ్రెస్ విమోచన దినోత్సవం నిర్వహించట్లేదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు తీసుకువస్తాం. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఏకతాటిపై నడుస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిలో మునిగిపోయాయి. కాంగ్రెస్ నేతలు తెలంగాణను ఢిల్లీ ఏటీఎంగా మార్చారు' అని అమిత్‌షా తీవ్ర ఆరోపణలు చేశారు.

**ప్రధాని వచ్చేస్తున్నారు..!**

ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో ప్రధాని మోదీ మూడు రోజుల పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ నెల 30న ప్రధాని జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఆంథోల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం, శేరిలింగంపల్లి పరిధిలోని ఐటీ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మే-03న వరంగల్ పార్లమెంటు పరిధిలో నిర్వహించే బహిరంగ సభలో మోదీ పాల్గొంటారు. అలాగే, నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల కోసం సంయుక్తంగా నిర్వహించే మరో సభకూ హాజరవుతారు. 4న నారాయణపేట, వికారాబాద్‌లో నిర్వహించే ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారు.

# యాత్రలో జనసమీకరణపై మల్లాగుల్లాలు

-మొదటి పేజి తరువాయి

గడువు ముగుస్తుది. పొలంబాట, రోడ్ షోలు, కార్నర్ మీటింగులు చేయాలని కేసీఆర్ అనుకుంటు న్నారు. ముగింపు సభను సిద్దిపేటలో నిర్వహిస్తారు. పార్టీ పెట్టిన తర్వాత ఎప్పుడూ ఎదుర్కోనంత క్లిష్టమైన పరిస్థితుల నేపథ్యంలో రెండు జాతీయ పార్టీలను ఢీకొట్టబోతున్నారు. నిజానికి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే జరుగుతోందన్న అభిప్రాయం ఉంది. ఈ క్రమంలో ఆ రెండు పార్టీల మధ్య బీఆర్ఎస్ మరింతగా నలిగిపోతోంది. రాష్ట్ర ఎన్నికల్లోనే పట్టించుకోని ఓటర్లు.. పార్లమెంట్ ఎన్నికల్లో పట్టించుకుంటారా అన్న ఆందోళన గులాబీ శ్రేణుల్లో ఉంది. కేసీఆర్ తుంటి గాయంతో గట్టిగా నిలబడలేని, నడవలేని పరిస్థితుల్లో ఉన్నారు. అయినా ఆయనకు తప్పడం లేదు. కేటీఆర్ ప్రచారభారాన్ని మోసేంత నేతగా మారలేదు. హరీష్ రావు మెదక్ కు పరిమితం అయ్యారు. మొత్తంగా కేసీఆర్‌కు ప్రచారం ప్రారంభించి పూర్తి చేయడం ఓ సవాలే.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి అగ్నిపరీక్షను ఎదుర్కొంటోంది. పదేండ్లు రాష్ట్రాన్ని ఏకచత్రాధిపత్యంతో పాలించిన కేసీఆర్ తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి కోలుకోకముందే లోక్ సభ ఎన్నికలు పార్టీ మనుగడకే సవాల్ విసురుతున్న పరిస్థితి ఉంది. లోక్ సభ ఎన్నికల్లో గణనీయ ఫలితాలు సాధించని పక్షంలో పార్టీ ఉనికి ప్రశ్నార్థకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రం సిద్ధించిన అనంతరం అప్రతిహతంగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్. మూడోసారి అనూహ్యంగా పరాజయం పాలయ్యింది. తీవ్రమైన ఓటమి నుంచి కోలుకోకముందే నాలుగు నెలల స్వల్పకాలంలోనే పార్లమెంట్ ఎన్నికలు ముంచుకురావడం సవాల్‌గా మారింది. నిజానికి ఇలా రావడం గతంలో కేసీఆర్ వ్యూహమే. అప్పట్లో ప్లస్ అయిందేమో కానీ ఇప్పుడు మైనస్‌గా మారుతోంది.కేసీఆర్ కుమార్తె కవిత ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంలో ఇరుక్కోవడం అసెంబ్లీ ఎన్నికల ముందు ఎజెండా కాగా, ఎన్నికల తర్వాత రాద్ధాంతంగా మారింది. కవిత అరెస్టు, జైలు బీఆర్ఎస్‌ను ఇబ్బందుల్లోకి నెట్టాయి. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మెడకు చుట్టుకుంటోంది. కాళేశ్వరం సహా ఇతర అవినీతి స్కాములను కాంగ్రెస్ ప్రభుత్వం బయటకు తీస్తోంది. ఇలా ఇబ్బందికరమైన వాతావరణం నెలకొనగా గోరుచుట్టుపై రోకలిపోటులా పార్టీ నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వలసపోవడం జరుగుతోంది. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలకు పెద్ద సంఖ్యలో సాగుతున్న వలసలు గులాబీ నాయకత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో కేసీఆర్ బస్సు యాత్ర పెద్ద సాహసమే అవుతుంది. 17 ఎంపీ స్థానాలకుగానూ ముగ్గురు సిట్టింగులకు బీఆర్ఎస్ అధినేత అవకాశం కల్పించారు. ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ స్థానాలు సిట్టింగులకు ఇచ్చారు. కరీంనగర్ సీటు గత ఎన్నికల్లో పోటీచేసిన బీ వినోద్ కుమార్‌కు దక్కింది. ఇక మిగిలిన 13 స్థానాల్లో కొత్తవారిని బరిలో దింపారు. ఓడిపోయే స్థానానికి పోటీ ఎందుకనే అభిప్రాయంతో పలువురు నేతలు ఉన్నారన్న చర్చలు నడిచాయి. వలసలను నివారించేందుకు బుజ్జగింపులు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. చేవెళ్ళ టికెట్ రంజిత్ రెడ్డికి ముందుగా డిక్లేర్ చేసినప్పటికీ ఆ పార్టీని కాదంటూ అధికార కాంగ్రెస్‌లో చేరిపోయి పోటీకి సిద్ధమయ్యారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీ మారుతున్నారని తెలిసి ఆయనను బలవంతంగా కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్ళి బుజ్జగించినా ఆ తర్వాత బీజేపీలో చేరిపోయారు. అంతేకాదు, వరంగల్ ఎంపీ అభ్యర్థి మారిపోయారు. ఇప్పుడు కొత్తవారికి అవకాశం ఇవ్వడంతో సీనియర్లు గుర్రుగా ఉన్నారు. ఇప్పటికే కొంతమంది పెట్టెబేడా సర్దేసుకుని కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఉన్న ఆ కొందరు నేతలు లోన రగిలిపోతున్నారు. ఇప్పుడు వాళ్లంతా కోవర్టులుగా పనిచేయాలని భావిస్తున్నట్టు టాక్. అంతేకాదు కేసీఆర్ బస్సు యాత్రలో భాగస్వామ్యం కాకూడదని, జనసమీకరణ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. పార్టీలో ఉన్న మరికొందరు నేతలు ఒకరితో ఒకరికి గిట్టక గ్రూపులు కడుతున్నారు. పైగా, జనసమీకరణకు తగినన్ని నిధులు కావాలి. జనం రాకపోతే నవ్వులపాలవ్వాల్సి వస్తుంది. ఇటీవల రైతు సమస్యలపై పర్యటనలు చేసిన కేసీఆర్‌కు ప్రతిచోటా జనం లేకపోవడం కనిపించింది.

## తెలంగాణలో మరో ఎన్నికల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్:** ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. మే 2వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఈసీ తెలిపింది. మే 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, మే 10న నామినేషన్ల పరిశీలన, మే 13న ఉపసంహరణకు చివరి తేదీగా ఈసీ పేర్కొంది. మే 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, జూన్ 5న కౌంటింగ్ జరుగుతుందని ఎన్నికల కమిషన్ వెల్లడించింది.




**ఉప ఎన్నిక షెడ్యూల్..**

మే 2వ తేదీన ఈసీ నోటిఫికేషన్ విడుదల.
మే 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ.
మే13న నామినేషన్ ఉపసంహరణకు చివరి తేదీ.
మే 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్.
జూన్ 5న ఓట్ల లెక్కింపు

## 17 లోక్ సభ స్థానాలకు 547 నామినేషన్లు

తెలంగాణలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. 17 లోక్ సభ స్థానాలకు గాను 547 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఈరోజు ముగిసింది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు డమ్మీ అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు కూడా చాలామంది నామినేషన్లు దాఖలు చేశారు. రేపు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ... 29వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మే 13న పోలింగ్, జూన్ 4న ఎన్నికల ఫలితాలు రానున్నాయి. ఖమ్మం లోక్ సభ స్థానానికి 29 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని రెండు లోక్ సభ స్థానాలకు 120కి పైగా నామినేషన్లు వచ్చాయి. ఈరోజు చివరి రోజు... దీనికి తోడు మంచి రోజు కావడంతో ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యాయి. కొంతమంది అభ్యర్థులు రెండు లేదా మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. ఇక్కడి నుంచి 13 నామినేషన్లు దాఖలయ్యాయి.

## రేపు గన్‌పార్క్ వద్ద తేల్చుకుందాం..
## రేవంత్‌కు హరీష్ రావు కౌంటర్

మెదక్ : ఆగస్టు 15లోగా రుణామాఫీ పక్కా చేస్తామని, రాజీనామా లేఖతో సిద్ధంగా ఉండాలంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. రేపు(శుక్రవారం) ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ముందు ఉన్న అమరవీరుల స్థూపం దగ్గరకి తన రాజీనామా లేఖతో వస్తా..నువ్వు వస్తావా? అని మరోసారి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో నిర్వహించిన ర్యాలీలో హరీష్‌రావు పాల్గొని ప్రసంగించారు. 'ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తానన్నది నిజమైతే, బాండ్ పేపర్ మీద రాసిచ్చిన గ్యారెంటీలు అమలు చేసే మాట నిజమైతే.. గన్ పార్క్ వద్దకు రా. రాజీనామా లేఖలను మేధావుల చేతుల్లో పెడుదాం. ఆగస్టు 15 లోగా రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే నా రాజీనామా లేఖను తీసుకెళ్లి స్పీకర్‌కు ఇస్తారు. ఒక వేళ అమలు చేయకపోతే నీ రాజీనామా లేఖ గవర్నర్‌కు ఇస్తారు. నువ్వు దానికి సిద్ధమా అని అడుగుతున్నా. దమ్ముంటే రా. మాట మీద నిలబడే వ్యక్తివి అయితేరా.. నువ్వు రాకపోతే తోక ముడిచినట్టే' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



## రెండు రోజుల్లో కాళేశ్వరం
## ప్రాజెక్టు అవకతవకలపై పేపర్ ప్రకటన



కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై నిర్మాణ సంస్థలతో పాటు అవసరమైతే సంబంధిత రాజకీయ నేతలకు కూడా నోటీసులు ఇస్తామని కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రఘోష్ అన్నారు. అవసరమైతే కేసీఆర్‌ను పిలిచి ఈ ప్రాజెక్టుపై తమకు కావాల్సిన సమాచారం సేకరిస్తామన్నారు. ఆయన గురువారం హైదరాబాద్‌లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెండు రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పేపర్ ప్రకటన ఇచ్చి ఆ తర్వాత దీనిపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడతామన్నారు. నిపుణుల అభిప్రాయాలు తీసుకొని విచారణ జరుపుతామన్నారు. ఎన్డీఎస్ఏ, విజిలెన్స్, కాగ్ రిపోర్టులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇంజినీర్లు, ఎన్డీఎస్ఏ అథారిటీతోనూ సమావేశం అవుతామన్నారు. టెక్నికల్ అంశాలను పరిగణనలోకి తీసుకొని విచారిస్తామన్నారు. బ్యారేజీతో సంబంధం ఉన్న అందరితో కలుస్తామన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లి పరిశీలిస్తామన్నారు. నివేదికల ఆధారంగా విచారణ కొనసాగుతుందన్నారు.

## విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు

**హైదరాబాద్ :** లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే.. కానీ, హైదరాబాద్ మహానగరం పరిధిలోని పలు వార్డులలో ముఖ్యంగా పాతబస్తీ పరధిలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందా లేదా అనే అనుమానం కలుగుతుంది. ఎన్నికల కోడ్ పుణ్యమా అని బెల్ట్ దందా లాభసాటిగా ఉండడంతో గతంలో కేవలం కిరాణా షాపులు మాత్రమే నిర్వహించేవారు కూడా నిబంధనలకు విరుద్ధంగా వార్డులలోని కిరాణా షాపుల్లో శీతల పానీయాలకు తోడుగా కొత్తగా బెల్ట్ దందా షురూ చేయడం గమనార్హం. ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపుల్లో బ్రాండెడ్ మద్యం తెల్లవారుజాము నుండి అర్ధరాత్రి వరకు ఎంతైనా దొరుకుతుందని పేర్కొంటున్నారు. దీంతో యువత మద్యానికి బానిసలుగా మారి తాగిన మైకంలో గొడవలకు దిగుతున్నారని.. బెల్టు దుకాణాల మధ్య ఉన్న ఇండ్ల యజమానులు ఆరోపిస్తున్నారు. ఇలా నగరంలోని బెల్ట్ షాపుల దందా విచ్చలవిడిగా కొనసాగుతున్న చర్యలు మాత్రం సున్నాఅని అంటున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న వైన్స్ షాపుల నుండి పట్టణంలోని బెల్ట్ షాపులకు ఆటో, బైకుల ద్వారా యధేచ్ఛగా మద్యం సరఫరా చేస్తూ ప్రతి గల్లీల్లో కూడా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు.


## సంపాదకీయం

# ముయిజ్జు జయకేతనం!

ఆదివారం ఏప్రిల్ 19, 2024న జరిగిన మాల్దీవుల పార్లమెంటు ఎన్నికల్లో విజేత చైనా అంటూ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక శీర్షిక పెట్టింది. దాదాపు అన్ని పత్రికలూ చైనా అనుకూల పార్టీ సూపర్ మెజారిటీ సాధించినట్లు నివేదించాయి. పీపుల్స్ మజ్లిస్ (పార్లమెంటు)లోని 93 స్థానాలకు గాను (ఇది రాస్తున్న సమయానికి అధికారికంగా లెక్కింపు పూర్తి కాలేదు) పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (పిఎన్‌సి), దాన్ని బలపరుస్తున్న వారికి 75, భారత అనుకూల మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీకి 15 స్థానాలు వచ్చినట్లు వార్తా సంస్థలు తెలిపాయి. మొత్తం 368 మంది పోటీ చేశారు. వారిలో 130 మంది స్వతంత్రులు కాగా మిగిలిన వారు ఏడు రాజకీయ పార్టీలకు చెందిన వారు. 2019లో జరిగిన ఎన్నికల్లో మాల్దీవుల డెమోక్రటిక్ పార్టీ 45.83 శాతం ఓట్లతో 87 స్థానాలకు గాను 65 తెచ్చుకుంది. ఆ ఎన్నికల నాటికి నూతన పార్టీగా పిఎన్‌సి 6.63 శాతం ఓట్లు, మూడు సీట్లు తెచ్చుకుంది. గతేడాది సెప్టెంబరు 9న జరిగిన ఎన్నికల్లో ఎవరికీ అవసరమైన 50 .శాతంపైగా మెజారిటీ రాకపోవటంతో 30న జరిగిన తుది దఫా ఎన్నికల్లో ఈ పార్టీ నేత మహమ్మద్ ముయిజ్జు 54.04 శాతం ఓట్లతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు, నవంబరు 17న బాధ్యతలను స్వీకరించాడు. అధ్యక్ష ఎన్నికలు, తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికలకు ఒక ప్రత్యేకత ఉంది. చిన్నదైనా పెద్దదైనా ఏ దేశంలోనూ విదేశాలతో సంబంధాల ప్రాతిపదికన ఎన్నికలు జరిగిన దాఖలాలు లేవు. చైనా–భారత్ మధ్య పోటీగా ఇక్కడ జరిగాయి. అందుకే అసలు విజేత చైనా అన్నట్లుగా వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. "అధ్యక్ష ఎన్నికలు తమ పౌరుల దేశ భక్తికి ఒక ప్రతిబింబమని, మా ఇరుగు పొరుగు వారు, భాగస్వాములు తమ స్వాతంత్ర్యం, సర్వసత్తాకతను పూర్తిగా గౌరవించాలని ఇచ్చిన ఒక పిలుపు" అని పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి వ్యాఖ్యానించాడు. పార్లమెంటు ఎన్నికలు మరింత తీవ్రంగా జరిగాయి. చైనా బిఆర్ఐ పథకం కింద పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసిన గత ప్రభుత్వంలో గృహశాఖ మంత్రిగా ముయిజ్జు పని చేశాడు. తాను అధికారానికి వస్తే రెండు దేశాల మధ్య మరో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతానని ఎంతో ముందుగానే ప్రకటించాడు. చెప్పినట్లుగానే భిన్నమైన రీతిలో వ్యవహరిస్తున్నాడు. గతంలో మాల్దీవుల్లో ఎవరు అధికారానికి వచ్చినా తొలి విదేశీ పర్యటన భారత్‌తోనే ప్రారంభమయ్యేది. అలాంటిది ముయిజ్జు తొలుత టర్కీ, తరువాత యుఏయి, చైనా పర్యటించాడు. 2019లో మనదేశంతో కుదుర్చుకున్న జల వాతావరణ (హైడ్రాలజీ) పరిశీలన పథకం నుంచి మాల్దీవులు వైదొలిగింది. అక్కడ ఉన్న కొద్ది మంది మన సైనికులను కూడా దశలవారీ మే 10వ తేదీలో వెనక్కు వెళ్లాలని కోరింది. రద్దీగా ఉండే తూర్పు–పశ్చిమ దేశాల నౌకా రవాణా మార్గంలో మాల్దీవులు కీలకమైన ప్రాంతంలో ఉంది. అమెరికా విశాల మిలిటరీ వ్యూహంలో హిందూ మహాసముద్రం ఎంతో ముఖ్యమైనది. బ్రిటీష్ ఆక్రమించిన మారిషస్‌కు చెందిన డిగో గార్సియా దీవులను అమెరికా తన ఆధీనంలోకి తెచ్చుకొని ఖాళీ చేసేందుకు మొరాయిస్తున్నది. అక్కడ ఒక సైనిక స్థావరాన్ని కూడా నిర్మించింది. మనదేశంలోని కన్యాకుమారికి ఆ దీవులు 1,796 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. అది మన దేశంతో పాటు పరిసరాల్లోని అన్ని దేశాలకూ ఆందోళన కలిగించే అంశమే. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం, అరేబియా సముద్ర ప్రాంతంలోని కొన్ని దేశాలు అమెరికా పట్టునుంచి విడివడటం, అవి క్రమంగా చైనాకు సన్నిహితం కావటం పశ్చిమ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. తమ విదేశాంగ విధానంలో కొన్ని మార్పులు చేశాం తప్ప ఎవరివైపూ మొగ్గటం లేదని ముయిజ్జు ప్రకటించాడు. మాల్దీవుల ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యత కారణంగా 1965లో బ్రిటన్ ఆక్రమణ నుంచి స్వాతంత్ర్యం పొందిన తరువాత మన దేశం అన్ని రంగాలలో దగ్గరయ్యేందుకు చూసింది. 1988లో దాదాపు రెండు వందల మంది తమిళ ఉగ్రవాదులు మాల్దీవులకు వెళ్లి నాటి అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్ మీద తిరుగుబాటు చేసి కీలకమైన ప్రాంతాలన్నింటినీ పట్టుకున్నారు. తమను అదుకోవాలని అనేక దేశాలను గయూమ్ కోరినా ఎవరూ ముందుకు రాలేదు. భారత్ స్పందించింది, ఆపరేషన్ కాక్టస్ పేరుతో కుట్రను విఫలం చేసి అనేక మంది కుట్రదారులను కాల్చి చంపి, కొందరిని బందీలుగా పట్టుకుంది. అప్పటి నుంచి సంబంధాలు మరింతగా బలపడ్డాయి. తరువాత జరిగిన పరిణామాల్లో దీవుల ఆర్థిక సమస్యలను, పౌరుల జీవితాలను మెరుగుపరచటంలో పాలకుల వైఫల్యం కారణంగా జనంలో అసంతృప్తి తలెత్తింది. సరిగ్గా అదే సమయంలో చైనా తన బిఆర్ఐ పథకాన్ని ముందుకు తెచ్చింది. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్, అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మాదిరి కఠినమైనవి కాకుండా సాధారణ షరతులతో ప్రాజెక్టులకు చైనా రుణాలు ఇచ్చింది. దాంతో 2013లో అధికారానికి వచ్చిన అబ్దుల్లా యామిన్ చైనాతో సంబంధాలను పెంచుకున్నాడు. 2018లో గెలిచిన ఇబ్రహీం సాలి భారత్‌కు పెద్ద పీట అనే విధానంతో మన దేశానికి సన్నిహితంగా భాగస్వామ్య ఒప్పందాలను చేసుకున్నాడు. అది ఎన్నికల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షాలుగా ఉన్న మాల్దీవుల ప్రోగ్రెసివ్ పార్టీ, పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ ఒక కూటమిగా ఏర్పడి "భారత్‌ను బయటకు పంపాలి (భారత్ అవుట్)" అనే నినాదమిచ్చాయి. మన దేశం అనుసరించిన కొన్ని విధానాలు, అంతర్గత వ్యవహారాల్లో జోక్యంతో జనంలో ఉన్న భారత వ్యతిరేక మనోభావాలు కూడా దీనికి దోహదం చేశాయి. మన దేశానికి చెందిన జిఎంఆర్ కంపెనీ మాలెలోని విమానాశ్రయ అభివృద్ధి నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. విదేశీ ప్రయాణీకులతో పాటు మాల్దీవుల పౌరుల మీద అభివృద్ధి పన్ను విధించటంతో అక్కడ వ్యతిరేకత వెల్లడైంది. దాని వెనుక మాజీ అధ్యక్షుడు నషీద్ మద్దతు ఉందని జనం భావించారు. అవినీతి ఆరోపణల కేసులో అరెస్టు కాకుండా తప్పించుకొనేందుకు అతగాడు భారత రాయబార కార్యాలయంలో ఆశ్రయం పొందాడు. అది కూడా జనంలో మనదేశం మీద వ్యతిరేకత పెరిగేందుకు దోహదం చేసింది. అధ్యక్షుడు ముయిజ్జు అనుసరిస్తున్న విధానాలతో విభేదించిన ప్రతిపక్షం పార్లమెంటులో తనకు ఉన్న మెజారిటీని ఆధారం చేసుకొని అభిశంసన తీర్మానం ద్వారా తొలగించేందుకు కూడా చూసింది. తాజా ఎన్నికల్లో అధికార పక్షం నాలుగింట మూడు వంతులకు పైగా స్థానాలు సాధించటంతో అలాంటి ముప్పు తొలగటమే గాక అధ్యక్షుడికి మరింత పట్టు దొరికింది. జనవరిలో చైనా పర్యటన జరిపిన ముయిజ్జు అనేక ఒప్పందాలు చేసుకున్నాడు. ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలను జనం బలపరిచినట్లు ఫలితాలు స్పష్టం చేశాయి. ఇంతవరకు మన దేశ పర్యటనకు రాలేదు. మాల్దీవులకు భారత్ స్నేహ హస్తం చాచేందుకు విముఖత చూపితే చైనాపై మరింతగా ఆధారపడతారని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మాల్దీవులకు పర్యాటకులు వెళ్ల వద్దని అధికారికంగా మన ప్రభుత్వం చెప్పకపోయినా జరిగిన పరిణామాలను చూస్తే నష్టం జరిగిందన్నది స్పష్టం. హనైమధూ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌తో సహా అనేక మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకాలలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయల వరకు మన దేశం పెట్టుబడులు ఉన్నాయి. వాటికి ఎలాంటి ముప్పు రాదు. మాల్దీవు ఎన్నికల్లో చైనా–భారత్‌లతో సంబంధాల గురించి పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అంత మాత్రాన వెల్లడైన తీర్పును ఆ ఒక్క అంశానికే ఆపాదించటం, మన దేశానికి వ్యతిరేకంగా పరిగణించాల్సిన అవసరం లేదు. అభివృద్ధి పథకాలకు పెట్టుబడులు కావాలని కోరినపుడు అనేక పశ్చిమ దేశాలు అక్కడ హక్కులకు భంగం కలిగించే పాలకులు వున్నారంటూ నిరాకరించాయి. ఆ సమయంలో చైనా ముందుకు వచ్చింది. హక్కులు, పాలన అనేది ఆయా దేశాల అంతర్గత వ్యవహారాలు, వాటికి పెట్టుబడులను ముడి పెడితే రాజకీయ పరిణామాలు, పర్యవసానాలు ఎలా ఉండేది చెప్పలేము.

# అసమాన గణిత శాస్త్రజ్ఞుడు రామానుజుడు

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ గణితశాస్త్ర సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అత్యుత్తమ అ'గణిత' మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం.అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (డిసెంబర్ 22, 1887ఏప్రిల్ 26, 1920) 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. ఆయనకు పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. పదమూడేళ్లకే ఎస్ఎల్ లోనీ త్రికోణమితిపై రాసిన పుస్తకాన్ని ఔపోసన పట్టడమే కాదు తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించారు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టక పోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరారు. అక్కడ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు. 1729 సంఖ్యను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు. తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేశారు. రామానుజన్ అనారోగ్యంతో హాస్పిటల్లో వున్నపుడు, హార్డీ ఆయనను పలుకరించటానికి వెళ్లి మాటల మధ్యలో తాను వచ్చిన కారు నంబరు 1729, దాని ప్రత్యేకత ఏమైనా ఉన్నదా ? అని అడిగారు. అందుకు రామానుజన్ తడుము కోకుండా ఆ సంఖ్య ఎంతో చక్కని సంఖ్య అని, ఎందుకంటే రెండు విధాలుగా రెండు ఘనముల మొత్తముగా వ్రాయబడే సంఖ్యా సమితిలో అతి చిన్నసంఖ్య అని తెల్పారు. ఈ సంఘటన గణితంపై ఆయనుకున్న అవ్యాజమైన అనురాగానికి, అంకిత భావానికి నిదర్శనం. మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత



మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం.. 15ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్కూచ్‌సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. 3,500 గణిత ఫలితాలను సమీకరించిన రికార్డును సొంతం చేసుకున్న మేధావి. 1903లో మద్రాసు విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్ వచ్చింది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చి పడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. చిత్తు కాగితాలను కూడా బహు జాగ్రత్తగా వాడుకుంటూ గణితమే లోకంగా బతికేవారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వ విద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా.వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డీ (1877–1947)కి పంపారు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు.

జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ప్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి. 33 ఏళ్ళకే ఆయన 1926, ఏప్రిల్ 26న మరణించారు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారు. రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2014ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్దులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విదేశీ ప్రొఫెసర్ హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం

# విలక్షణ వ్యక్తిత్వం ఎంఎస్ఆర్‌కే సొంతం

విచిత్ర మనస్తత్వం.. నిక్కచ్చిగా వ్యవహరించే నైజం. కుండలు బద్దలు కొట్టినట్లు మాట్లాడే ముక్కుసూటి తనం, నిండైన అమాయకత్వం, మచ్చలేని రాజకీయ జీవితం... వెరసి ఎం.సత్యనారాయణ రావు వ్యక్తిత్వం. మాచినేని సత్యనారాయణ రావు అంటే వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. ఎం ఎస్ ఆర్ అంటే తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం వెదిర గ్రామంలో ఎంఎస్ఆర్ జనవరి 14, 1934న జన్మించారు. విద్యార్థి దశ నుండే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై స్పందించే వారు. హైదరాబాద్ లో వి.వి. కళాశాలలో చదువు తున్నపుడు తన గొంతు వినిపించే వారు. 1969 తొలి తెలంగాణ ఉద్యమంలో ఆయన చెన్నారెడ్డి లాంటి నాయకులతో కలిసి చురుకుగా పాల్గొన్నారు. 1971లో తెలంగాణ ప్రజా సమితి ఎంపీగా ఎంఎస్ఆర్ గెలుపొందారు. అనంతరం మరో రెండు పర్యాయాలు కాంగ్రెస్ ఎంపీగా గెలిచారు. 14 ఏళ్ల పాటు ఎంపీగా కొనసాగారు.1980 నుండి 1983 వరకు ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన పార్టీ వ్యవహారాల్లో ఇందిరా గాంధీతో సన్నిహితంగా ఉన్నారు. 1990–94 వరకు ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2000 నుంచి 2004 వరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంఎస్ఆర్ పనిచేశారు. 2004–07 వరకు దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి మంత్రివర్గంలో దేవాదాయ, క్రీడ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేశారు. 2007 తర్వాత ఆర్టీసీ చైర్మన్‌గా ఎం.సత్యనారాయణ రావు తిరిగి సేవలందించారు. 77–79 లోక సభ సభ్యుడుగా, హౌస్ కమిటీ బాధ్యునిగా ఆస్ట్రేలియా మరియు ఇతర దేశాలకు పార్లమెంటరీ ప్రతినిధి సభ్యునిగా వెళ్లారు.ఇందిరాగాంధీతో పాటు నెహ్రూ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఆయనకు పేరుంది. చాలా సందర్భాల్లో ఆయన హైకమాండ్‌కి ఎదురు తిరిగేవారు కూడా. ఆయన ఎప్పుడు ఎలా స్పందిస్తారో అని హైకమాండ్ ఒక్కోసారి ఆందోళన చెందేది. తన పర భేదం లేకుండా వ్యాఖ్యానాలు చేసేవారు. అవి అప్పుడప్పుడు సంచలనాలుగా మారేవి. రాజకీయాలు వేడెక్కేవి. అలా ముఖ్యమంత్రిగా వైఎస్ ఉన్న సమయంలో సహచర మంత్రిగా 2006 లో, టిఆర్ఎస్ చీఫ్ కెసిఆర్ ను సవాలు విసిరి కరీంనగర్ లోక్ సభ ఉప ఎన్నికకు కారణమై, కేసిఆర్ గెలుపుకు బాధ్యులుగా, రాజీనామా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడిగా ఎంఎస్ఆర్ విసిరిన సవాలుకు ప్రతిస్పందనగా కెసిఆర్ 2006 లో తెలంగాణకు ఎంపి పదవికి రాజీనామా చేశారు. తెలంగాణ వాదిగా, ఎంపీగా, మంత్రిగా ఎమ్మెస్సార్ ప్రత్యేక శైలి కనబరిచారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీలు రాజీనామాలు చేసిన నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగిన ఆయన అందరికీ పరిచయమే. ముఖ్యంగా ఢిల్లీ పెద్దలతో ఆయన బాగా సత్సంబంధాలు కొనసాగించేవారు. చాలా వ్యవహారాల్లో ఢిల్లీ పెద్దలు ఆయన అభిప్రాయాల్ని లెక్కలోకి తీసుకునేవారు. నాగర్జున సాగర్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం సమయంలో రావు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కలిశారు. తెలంగాణ రాజకీయాలపై చర్చించారు. తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌తో విలీనం చేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. జహర్‌లాల్ నెహ్రూతో నిజామా బాద్‌ను సందర్శించినప్పుడు ఆయన తన భావాలను వ్యక్తం చేసినట్లు చెప్పేవారు. రాజశేఖర రెడ్డి మరణం తర్వాత... ఉమ్మడి రాష్ట్రం... ఆంధ్రప్రదేశ్, తెలంగాణగా విభజించిన తర్వాత... ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరం అయ్యారు. ఇందిరా గాంధీ తో సన్నిహితంగా మెలిగిన ఆయన... రాజకీయాలు బహు దూరంగా పైలెట్ గా ఉన్న రాజీవ్ గాంధీని, ఇందిర కోరిక మేరకు తానే రాజీవ్ ను మెప్పించి ఒప్పించి రాజకీయాల్లోకి తెచ్చానని చెపుతుండే వారు. పలు రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా ఉన్న సమయంలో ఒక సందర్భంలో ఉత్తర ప్రదేశ్ వెళ్ళినపుడు, నాటి యు. పి. కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ దయాళ్ శర్మ, తనకోసం గంటల కొద్దీ వేచి ఉండి, స్వాగతం పలికి, దండ వేసిన అపూర్వ సంఘటనను గుర్తు చేసుకునే వారు. రాష్ట్ర రాజకీయాలలో చెరగని ముద్ర వేసుకున్న ఎం.ఎస్. ఆర్. కు కరోనా సోకి, తీవ్రత అధికం కావడంతో, హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించింపబడి, చికిత్స పొందుతూ, 2021 ఏప్రిల్ 26న తుదిశ్వాస విడిచారు. తెలంగాణ వాదిగా, ఎంపీగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, ఆర్టీసీ చైర్మన్ గా ఎమ్మెస్సార్ ప్రత్యేక శైలి కనబరిచి, రాజకీయాల్లో ముక్కుసూటి మనిషిగా పేరొందిన ఎం ఎస్ ఆర్ మృతితో తెలంగాణ ఒక నిబద్ధత కలిగిన రాజకీయ నాయకున్ని కోల్పోయింది.

# కొల్హాపూర్ మహాలక్ష్మి రథోత్సవం

ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో చైత్ర పౌర్ణమి రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. ఈ ఏడు ఏప్రిల్ 23వ తేదీన మంగళ వారం లక్ష్మీ దేవి మూర్తిని కలిగి ఉన్న రథాన్ని రాత్రి 7:30 నుండి ఊరేగింపుగా తీసుకు వెళతారు.. ఈ సందర్భంగా వెండి రథాన్ని ప్రత్యేక దీపాలు, పూలతో అలంకరించారు. హిందూ సాంప్రదాయంలో లక్ష్మీదేవిని పూజించడం సర్వత్రా కనిపించే దయినా, అనునిత్యం పూజలందుకునే శ్రీమహాలక్ష్మికి మన దేశంలో విడిగా వున్న ఆలయాలు తక్కువే. లక్ష్మీదేవికి ప్రత్యేకించి వున్న ఆలయాలలో కొల్హాపూర్ ఆలయం ముఖ్యమయినది. ఈ ఆలయం మహారాష్ట్రలోని కొల్హాపూర్ లో పంచగంగ నది ఒడ్డున బెంగళూరు మరియు పూణే మధ్య జాతీయ రహదారిపై ఉంది. ఇది అమ్మవారి అష్టాదశ శక్తి పీఠాలలో ఏడవది. స్కాంద పురాణం, దేవీ భాగవతాలలోఈ క్షేత్రాన్ని కరవీర నగరమని, దేవిని కరవీర మహాలక్ష్మి అని ప్రస్తుతించారు. పరమశివుడికి కాశీ ఎలా అవిముక్త క్షేత్రమో, శ్రీ మహావిష్ణువుకి, లక్ష్మీదేవికి ఇది అవిముక్త క్షేత్రం. వారీ క్షేత్రాన్ని ఎప్పుడూ విడవకుండా వుంటారు. అగస్త్య మహాముని అచంచల శివభక్తుడు. ఏటా కాశీ వెళ్లి విశ్వనాథుణ్ణి దర్శించుకునేవాడు. వృద్ధాప్యంలో అగస్త్యుడికి సుదూరంలో ఉన్న కాశీనగరాన్ని దర్శించుకోవడం కష్టమనిపించి, శివుడి గురించి తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై, వరం కోరుకోమన్నాడు. అగస్త్యుడు తాను వయోభారంతో ఏటా కాశీలో ఉన్న విశ్వనాథుణ్ణి దర్శించుకోలేకపోతున్నానని, కాశీకి ప్రత్యామ్నాయంగా తనకో క్షేత్రాన్ని చూపిస్తే, అక్కడే తాను శివుణ్ణి దర్శిస్తానని కోరాడు. కాశీతో సమానమైన ప్రాశస్త్యం గల నగరం కొల్హాపురమని, అక్కడ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు కొలువై ఉన్న క్షేత్ర సందర్శనం తనను కాశీలో దర్శించుకున్నంత పుణ్యఫలాలనిస్తుందని చెప్పాడట.శివుని ఆనతిమేరకు అగస్త్యుడు కొల్హాపూర్‌లో మహాలక్ష్మిని, అతిబలేశ్వరస్వామిని దర్శించి పునీతుడయ్యాడని ఇక్కడి స్థలపురాణాల ద్వారా స్పష్టం అవుతున్నది. ప్రళయకాలంలో శివుడు తన త్రిశూలంతో కాశీ పట్టణాన్ని ఎత్తి రక్షించినట్లు, మహాలక్ష్మి ఈ క్షేత్రాన్ని తన కరములతో ఎత్తి రక్షించింది. అందుకే ఆమె కరవీర మహాలక్ష్మి అయింది అంటారు. భృగు మహర్షి చేసిన అవమానాన్ని తట్టుకోలేని మహాలక్ష్మి వైకుంఠాన్ని విడిచి సహ్యాద్రి పర్వత ప్రాంతంలోని కొల్హాపూర్‌లో వెలిశారని ఒక కథ. శంకరాచార్యులవారు ఈ ఆలయాన్ని దర్శించి ఇక్కడ శ్రీ చక్రాన్ని స్థాపించారు. తర్వాత విద్యాశంకర భారతి ఈ క్షేత్ర వైశిష్ట్యాన్ని గుర్తించి ఇక్కడ ఒక మఠం నిర్మించారు. దత్తాత్రేయుడు ప్రతి రోజూ మధ్యాహ్నం ఇక్కడ భిక్ష చేస్తారని ప్రతీతి. దానికి చిహ్నంగా ఇక్కడ ఆయనకి ఉపాలయం వున్నది. షుమారు 6 వేల సంవత్సరాల క్రితం ఆలయంగా భావిస్తారు. తర్వాత అనేక రాజుల సమయాలలో అభివృద్ధి చెందిన ఈ మందిరం విశాల ప్రాంగణంలో హేమాడ్ పంత్ శైలిలో, శిల్పకళా నైపుణ్యంతో నిర్మింపబడింది. 7 వ శతాబ్దం లోని ఈ దేవాలయాన్ని చాళుక్య వంశ రాజైన కరన్దేవ్ తిరిగి చాలాకాలం తరువాత దీని నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పవిత్ర స్థల నిర్మాణ శైలి హేమండ్ పతి ప్రేరణతో చేయబడింది. ఈ ఆలయాన్ని యాదవ వంశీయులు 8 వ శతాబ్దంలో మరింత అందంగా తీర్చిదిద్దారని చెపుతారు. ఈ నగరాన్ని కోల్‌పూర్ అని కోల్‌గిరి అని, కొలదిగిరి పట్టణ్ అని పిలిచేవారు.


'కొల్లా' అంటే 'లోయ'అని, 'పూర్' అంటే పట్టణమనే అర్థంలో ఈ క్షేత్రం విలసిల్లిందని చెబుతారు. కొల్హాపూర్ క్షేత్రాన్ని 1359వ సంవత్సరం వరకు శివాజీ మహారాజు పూర్వీకులు పాలించగా, 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ ఏలుబడిలో దినదిన ప్రవర్ధమానమైందని తెలుస్తోంది.నాలుగు దిక్కులా ముఖద్వారాలు కలిగి ఆలయం 5 గోపురాలకింద వుంటుంది. మధ్యలో ఒక గోపురం, నాలుగు దిక్కులా నాలుగు గోపురాలు. తూర్పు గోపురం కింద మహాలక్ష్మి, మధ్య కుమార మండపం, పడమర గణపతి, ఉత్తర దక్షిణ గోపురాల కింద మహాకాళి, మహా సరస్వతి కొలువుతీరి వున్నారు. ఉపాలయాలలో వెంకటేశ్వరస్వామి, నవగ్రహాలు, రాధాకృష్ణ, కాలభైరవ, వినాయకుడు, సింహవాహిని, తుల్జాభవాని వగైరా అనేక దేవీ దేవతలున్నారు.గర్భగుడిలో అమ్మవారి విగ్రహం సుమారు ఆరడుగుల చదరంగా ఉన్న ఎత్తైన వేదిక మీద రెండడుగుల పీఠం, దానిమీద మహాలక్ష్మి కూర్చొని ఉన్న భంగిమలో ఉంటుంది. చతుర్భుజి. నాలుగు చేతులలో పండు, గద, డాలు, పానపాత్ర ధరించి వుంటుంది మూడడుగుల ఎత్తున్న మూర్తి, అనేక ఆభరణాలతో సుసజ్జిత.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



# పార్లమెంట్ విచార్ విభాగ్ కోఆర్డినేటర్'గా జావిద్ అహ్మద్

## ఉత్తర్వులు జారీచేసిన ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ విచార్ విభాగ్ కోఆర్డినేటర్'గా కాంగ్రెస్ నాయకులు జావిద్ అహ్మద్ ను నియమిస్తూ ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని ఆదిలాబాద్ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ ల చేతుల మీదుగా ఆదిలాబాద్ పార్లమెంట్ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ గా జావిద్ అహ్మద్ గురువారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే వారికి సముచితస్థానం కల్పించబడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడాలని, జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సుగుణ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. తదనంతరం జావీద్ అహ్మద్ తుల అరుణ్ కుమార్, కంది శ్రీనివాస్ రెడ్డి, ఆత్రం సుగుణ, బజార్ హత్నూర్ జడ్పిటిసి మల్లెపూలు నర్సయ్య లను శాలువాతో సన్మానించిన కృతజ్ఞతలు తెలిపారు.

# ఓకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి

## హైదరాబాద్ నుంచి గుణదల ప్రయాణిస్తుండగా ఘటన







**వాస్తవ నేస్తం,బోనకల్:** సూర్యాపేట జిల్లాలో రోడ్డు ప్రమాదం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. బోనకల్ మండలం గోవిందపురం గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన నల్లమల్ల చందర్రావు కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి కోసం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. అయితే గురువారం తెల్లవారుజామున విజయవాడ గుణదల వెళ్తుండగా వారిని మృత్యువు వెంటాడింది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇంకో ఇద్దరు కు సీరియస్ గా ఉన్నట్లు సమాచారం తెలియ డంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. ఈ పిడుగు లాంటి వార్త విని గోవిందపురం గ్రామస్తులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గ్రామం అంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. నల్లమల్ల చందర్రావు కుటుంబం బతుకుతెరువు కోసం హైదరాబాద్ వెళ్లి కుటుంబం అంతా ఒక్కసారి శవాలతో ఇంటికి రావడం బాధాకరమని ప్రజలంతా విలపిస్తున్నారు. మృతి చెందిన వారిలో నల్లమల్ల చందర్రావు(47), నల్లమల్ల మాణిక్యం (43), నల్లమల కృష్ణంరాజు(25), కోడలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## - అంతర్జాతీయ మలేరియా డే సందర్భంగా ర్యాలీ



**వాస్తవనేస్తం,అనంతగిరి:** అంతర్జాతీయ మలేరియా డే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం త్రిపురవరం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ మరింత సమానత్వ ప్రపంచం కోసం మలేరియాతో పోరాటాన్ని ఉధృతం చేయాలి అనే నినాదంతో మలేరియాను అరికట్టవచ్చు అని తెలిపారు. మలేరియా జబ్బును హాని కలిగించే ఆడ అనాఫిస్ దోమలు మన ఇంటి పరిసరాల నీటి స్థావరాలలో పెరిగి రాత్రి పూట కుట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ దోమ కుట్టడం వలన ఎక్కవగా ప్లాస్మోడియా ఫల్సిపారం, ప్లాస్మోడీయం వైవాక్స్ బారిన పడడం వలన చలి జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం బారిన పడతారని ప్రజలు పరిసరాల్లో నీరు నిల్వలేకుండ చూసుకోవాలని, ప్రతీ వారానికి ఒకసారి పూల కుండిలలో, టైర్లలో చిన్న చిన్న పాత్రలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. దోమ తెరలు, ఇంట్లోకి దోమలు రాకుండా కిటికీలకు జాలీలు బిగించుకోవాలని, పొడవు చేతుల చొక్కాలు ధరించాలని తగు జాగ్రత్తలు పాటించాలని 2030 వరకు ఇండియాను మలేరియా రహిత దేశంగా అవతరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరినాథ్, ప్రసన్న, శ్రావణి, రత్నమేరి, శైలజ, కళావతి, విజయ్ కుమార్, కృష్ణమూర్తి, శ్రీదేవి, విజయ, మహేశ్వరి, రమాదేవి, రమ, మంజుల ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# లారీని ఢీకొన్న కారు.. డ్రైవర్ సజీవదహనం

**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రింగ్ రోడ్డు పై ఆగి ఉన్న బొగ్గు లారీని వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో కారు పూర్తిగా దగ్ధమై కారు నడుపుతున్న వ్యక్తి పూర్తిగా సజీవ దహనం అయ్యారు. ముత్తంగి ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ వద్ద మేడ్చల్ నుంచి వస్తున్న కారు వైజాగ్ నుంచి పాశమైలారం లో బొగ్గును అన్ లోడ్ చేసేందుకు వెళ్లే క్రమంలో ఓఆర్‌ఆర్ పై ఆగి ఉన్న లారీని వెనక నుంచి వచ్చి ఢీ కొట్టింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా దగ్ధమవడంతో పాటు కారు నడుపుతున్న ఓ వ్యక్తి సజీవ దహనమయ్యారు. కారు నంబర్ ప్లేట్ సగం వరకు కాలిపోవడం, వ్యక్తి పూర్తిగా దగ్ధమవడంతో ఇంకా వివరాలు తెలియాల్సి ఉందని పటాన్ చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. అగ్నిమాపక సిబ్బందితో మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో మేడ్చల్ నుంచి శంషాబాద్ వెళ్లే ఓఆర్‌ఆర్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కారు పూర్తిగా దగ్ధం అవ్వడంతో పోలీసులు కార్ నెంబర్ ను గుర్తించి వివరాలు తెలుసుకునే పనిలో ఉన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉందని సీఐ ప్రవీణ్ రెడ్డి వెల్లడించారు.

# తెలంగాణలో టీడీపీ పాలన నడుస్తోంది

**సికింద్రాబాద్ :** రాష్ట్రంలో తెలుగుదేశం కాంగ్రెస్ పార్టీ పాలన జరుగుతుందని మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ సంచలన ఆరోపణలు చేశారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా సర్వే నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలైన కాంగ్రెస్ వాదులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అవేదన వ్యక్తం చేశారు. టికెట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం జరిగిందన్నారు.కంటోన్మెంటకాంగ్రెస్ బి ఫామ్ ఇస్తే కాంగ్రెస్ తరపున పోటీ చేస్తానని లేని పక్షంలో కాంగ్రెస్ రెబల్ గా బరిలో ఉంటానన్నారు.

## హస్తం గూటికి మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్
## - కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**వాస్తవ నేస్తం,జుక్కల్ (డోంగ్లి):** జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం రోజున డోంగ్లీ మండలం లోని ధోతి గ్రామ అధ్యక్షుడు సంగ్రామ్ పటేల్ మరియు శ్రీకాంత్ పటేల్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ నుండి సర్పంచ్ కాశీనాథ్ పటేల్, ఉప సర్పంచ్ బాలు జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఏఎంసీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, డోంగ్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజు పటేల్, కులకర్ణి గజానన్ పటేల్, డోంగ్లి మండల నాయకులు శివాజీ పటేల్,మద్నూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దరాస్వర్ సాయిలు, గ్రామ నాయకులు శివరాజ్ పటేల్, రాజు పటేల్, బసవరాజ్, రాజ్ కుమార్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి



**వాస్తవ నేస్తం,భీంపూర్:** ఓటు హక్కు అమూల్యమైనదని దానిని ప్రతి ఒక్కరూ తప్పక వినియోగించుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త గుర్తుచేశారు.గురువారం మండలంలోని జల్కోరిలో కొత్తగా ఏర్పాటైన పోలింగ్ స్టేషన్ నెంబర్ 15/ఏ సందర్శించారు.ఇంటింటికీ ఓటరు స్లిప్పులు అందజేయాలని బిఎల్ఓ లను ఆదేశించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. పీవోతో తహసీల్దార్ సత్యనారాయణ,ఆర్ఐ శారద,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన దళిత జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహా ను దళిత జర్నలిస్టుల ఫోరమ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కాషాపోగు జాన్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మంత్రి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు అనంతరం సంఘం ఆదేశాల మేరకు దళిత జర్నలిస్టుల ఫోరమ్ గౌరవ అధ్యక్షులుగా మంత్రిని ఉండాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేయగా మంత్రి సానుకూలంగా స్పందించి గౌరవ అధ్యక్షులుగా ఉండేందుకు అంగీకారం తెలిపారు. అనంతరం దళిత జర్నలిస్టుల ఫోరమ్ కమిటిని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.దళిత జర్నలిస్టుల హక్కులకోసం, సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల కు హెల్త్ కార్డులు,డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగత్ ప్రకాశ్, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు ఫాల్గొన్నారు.

## మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన హెడ్ కానిస్టేబుల్ పై కేసు నమోదు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** రెండవ బెటాలియన్'లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న ఎడిపెల్లి గణేష్ తన నివాసం దగ్గర ఒక మహిళ ఇంటిలోకి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించిన కారణంగా మహిళ ఫిర్యాదు మేరకు స్థానిక మావల పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. కేసు విచారణ మావల పోలీస్ స్టేషన్ నందు జరుగుతుందని తెలిపారు. మహిళతో అసభ్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ గణేష్ పై శాఖపరమైన చర్యలకు రిపోర్ట్ ను పంపడం జరుగుతుందని తెలిపారు.

## ఇంటర్ ఫలితాలు.. ఏడుగురు విద్యార్థుల ఆత్మహత్య

**హైదరాబాద్ :** తెలంగాణలో ఇంటర్ ఫలితాలు వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాము పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని ఆరుగురు విద్యార్థులు మనస్తాపంతో ఆత్మహత్య చేసకోవడం కలకలం రేపింది. మరో విద్యార్థిని ఫెయిలవుతాననే భయంతో ఫలితాలకు ముందే బలవన్మరణానికి పాల్పడింది.

## అభివృద్ధి కోసం ఓటు వేయండి... ఒక్క అవకాశం ఇవ్వండి




**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఈసారి పార్లమెంటు ఎన్నిక వైఫల్య పార్టీలు నాయకులూ మరియు అభివృద్ధి కోసం ముందుకు వచ్చిన సుభాష్ రాథోడ్ కు మధ్య జరుగుతున్నాయని స్వతంత్ర అభ్యర్థి సుభాష్ రాథోడ్ అన్నారు. గురువారం రోజు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా చెబుతూ ఓటు ఆవశ్యకత గురించి వివరించి చెప్పారు. వ్యాపారులను కలుస్తూ మి ఓటు పేద ప్రజల హక్కులు కోసం, వారి అభివృద్ధి కోసం వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ శేష్ రావ్, దత్తా లాటే, వినోద్ హరణ్, గబ్బర్ సింగ్, శ్రీనివాస్ ఉప్పరి, తరుణ్, సాయి కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు

**హైదరాబాద్ :** రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేసింది. అయితే, సైబర్ నేరాలకు సంబంధించి విచారణలో దేశానికే మార్గదర్శకంగా ఉన్న తెలంగాణ పోలీస్ శాఖ మరో ముందడుగు వేసింది. నేరాలు జరుగుతున్న తీరును అధ్యయనం చేసి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి ఆర్బీఐకు తాజాగా కొన్ని సూచనలు చేసింది. ఫిర్యాదు చేసినప్పటికీ సరైన వ్యవస్థ లేకపోవడం వల్ల కొల్లగొట్టిన డబ్బు బాధితునికి రావడం లేదని గుర్తించారు. ఈ క్రమంలో అనవసర జాప్యం నివారిస్తే ఫలితం ఉంటుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఆర్బీఐకి సూచించారు.

# థైరాయిడ్ తగ్గాలంటే..?




థైరాయిడ్ సమస్యకు బచ్చలికూర, కొత్తిమీర, పుదీనా వంటి ఆకుపచ్చటి కూరగాయలతో చేసిన జ్యూస్‌లను క్రమం తప్పకుండా తాగుతూ ఉంటే.. ఖచ్చితంగా మంచి ఉపశమనం లభిస్తుంది.ఎందుకంటే పచ్చటి ఆకు కూరల రసంలో వైద్యం చేసే గుణాలు పుష్కలంగా ఉన్నాయి.దీంతో పాటు దోసకాయ లేదా నిమ్మరసం కూడా తాగొచ్చు.బాదం పాలు శరీరంలో మంటను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. పాలు లేదా పాల ఉత్పత్తులకు అలెర్జీ ఉన్నవారు బాదం పాలు తాగవచ్చు. స్మూతీస్ కాకుండా, మీరు టీ, కాఫీ, బాదం పాలను తాగితే మంచిది.అలాగే అశ్వగంధ, శతావరి థైరాయిడ్ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. మీ రోజువారీ ఆహారంలో ఈ రెండు మూలికలతో చేసిన టీని చేర్చుకోవటం మంచిది. కావాలంటే మీరు గ్రీన్ టీ కూడా తాగవచ్చు. మీరు ఖాళీ కడుపుతో హెర్బల్ టీ తాగితే మీరు ప్రయోజనాలను పొందుతారు.రోజువారీ ఆహారంలో మజ్జిగను తప్పని సరిగా చేర్చుకోవటం కూడా థైరాయిడ్ బాధితులకు మంచి ఫలితాలు ఇస్తుంది. . మజ్జిగ గట్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. హైపోథైరాయిడిజంలో మంటను తగ్గిస్తుంది. ఎందుకంటే మజ్జిగలో ప్రోబయోటిక్స్ ఉంటాయి.పాలు, పసుపు కలిపి తాగటం థైరాయిడ్ బాధితులకు మంచి ఉపశమనం అంటున్నారు నిపుణులు. వేడి పాలలో చిటికెడు పసుపు కలుపుకుని తాగాలి. ఈ మిశ్రమంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. అంతేకాకుండా, పసుపులో ఉండే కర్కుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఈ డ్రింక్ పోషక విలువలను పెంచుతుంది. థైరాయిడ్ సమస్యలకు పసుపు పాలు చాలా ఉపయోగకరంగా పనిచేస్తుంది.ఒక గ్లాసు నీటిలో 1 టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ ను వేసి బాగా కలుపుకుని తాగాలి. ఆల్కలీన్ స్వభావం కలిగిన ఈ పానీయం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. అలాగే మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది థైరాయిడ్ హార్మోన్ స్రావాన్ని కూడా నియంత్రిస్తుంది.థైరాయిడ్ బాధితులకు క్యారెట్, బీట్‌రూట్ జ్యూస్ తీసుకోవడం మంచిది. మజ్జిగలో ఫైటోన్యూట్రియెంట్స్, లైకోపీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.

# తెల్ల రక్తకణాలను పెంచే వెలగపండు!

భారతీయులకు వెలగపండు అంటే తెలియని వారంటూ ఎవరూ ఉండరు. ముఖ్యంగా వినాయకుడికి ఇష్టమైన పండు గా వీటిని మనం పెడుతూ ఉంటాము. ఇందులో ఉండే విటమిన్-జ పుష్కలంగా ఉంటుంది.ముఖ్యంగా ఇమ్యూనిటీ బూస్ట్ కూడా పెంచేలా చేస్తుంది. ఇది ఆరోగ్యాన్ని కూడా కాపాడేలా చేస్తాయి. ఇందులో ఉండేటువంటి ఖనిజాలు, పొటాషియం వంటివి పుష్కలంగా లభిస్తాయి. అలాగే కాల్షియం కూడా ఎముకలో ఆరోగ్యంగా ఉండేలా సహాయపడతాయి. అందుకే వెలగపండుని కనీసం నెలలో ఒకసారైనా తినాలని నిపుణులు తెలియజేస్తూ ఉంటారు.వెలగ పండులో ఉండే ముఖ్యమైన ఆరోగ్య ప్రయోజనం జీర్ణ వ్యవస్థను మంచిగా ఉండేలా చేస్తుంది. ముఖ్యంగా ఇందులో ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. పెద్దపేగు ఆరోగ్యంగా ఉండేలా వెలగపండు సహాయపడుతుంది.వెలగపండు తినడం వల్ల మలబద్ధ సమస్య కూడా తగ్గిస్తుంది. ఇందులో ఫైబర్ కంటెంట్ కూడా ఎక్కువగా ఉండటంవల్ల ట్యానీన్స్ మలబద్ధక పేగు ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుందట.వెలగపండుని డైట్ లో చేర్చుకోవడం వల్ల సులువుగా బరువు తగ్గవచ్చు. ఎందుకంటే ఇందులో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి.. ఫైబర్ కంటెంట్ మాత్రమే కాస్త ఎక్కువగా ఉంటుంది. వెలగపండులో ఉండేటువంటి యాంటీ ఆక్సిడెంట్ ఫ్రీ రాడికల్ సమస్యల నుంచి కూడా కాపాడుతాయి. అలాగే ముఖం పైన ఉండేటువంటి వృద్ధాప్య ఛాయలు కూడా రానివ్వకుండా చేస్తుంది. వెలగ పండులో ఇమ్యూనిటీ పెంచేటువంటి గుణాలు చాలా ఎక్కువగానే ఉంటాయి. రక్తంలో ఉండేటువంటి ఉండేటువంటి తెల్ల రక్త కణాలను పెంచడానికి ఈ వెలగపండు చాలా ఉపయోగపడుతుంది. ఈ తెల్ల రక్త కణాలు మన శరీరం ఇన్ఫెక్షన్ బారిన పడకుండా కాపాడుతూ ఉంటాయి. వెలగపండులో పొటాషియం ఉండడం వల్ల ఇది గుండె ఆరోగ్యాంగా ఉంచడానికి ఉపయోగపడుతుంది. అలాగే అధిక బీపీ తో ఎవరైనా ఇబ్బంది పడుతూ ఉంటే నెలలో ఒకసారైనా సరే ఈ వెలగ పండుని తినడం మంచిది. ఈ పండుని ఎలాగైనా సరే మనం తినవచ్చు.





# లివర్ జబ్బు ఈజీగా తగ్గాలంటే?


కాలేయం మన శరీరంలో ముఖ్యమైన భాగం. ఎందుకంటే ఇది మన శరీరంలో అనేక ముఖ్యమైన విధులను నిర్వర్తిస్తుంది. హార్మోన్లను ఉత్పత్తి చేయడంలో, శరీరాన్ని డిటాక్సిఫికేషన్ చేయడంలో ఇలా అనేక రకాల విధులను కాలేయం నిర్వర్తిస్తుంది.నేటి కాలంలో ఆహారపు అలవాట్ల కారణంగా మనలో చాలా మంది ఫ్యాటీ లివర్ సమస్యలతో బాధపడుతున్నారు. అధిక బరువు, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం, నూనెలో వేయించిన పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు ఎక్కువగా పేరుకుపోతుంది.అయితే తగిన ఆహారాలను తీసుకుంటూ జీవనశైలిలో మార్పు చేసుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆరోగ్య నిపుణులు తెలియజేస్తున్నారు. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో వెల్లుల్లి మనకు ఎంతో సహాయపడుతుంది. కాలేయాన్ని సంరక్షించే ఎంజైమ్ లు వెల్లుల్లిలో ఎక్కువగా ఉంటాయి. అలాగే ఆకుపచ్చ కూరగాయలను, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఇవి కాలేయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అలాగే విటమిన్ సి ఎక్కువగా ఉండే సిట్రస్ జాతి పండ్లను తీసుకోవాలి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో ఉత్తమంగా పని చేస్తాయి.నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారికి కాఫీ ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాఫీలో క్లోరోజెనిక్ యాసిడ్ తో పాటు పాలీఫినాల్స్, కెఫిన్, మిథైల్క్సాంథైన్, లిపిడ్లు, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. కాలేయంలో చేరిన కొవ్వును తొలగించడంలో కాఫీ మనకు ఎంతో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కాలేయ ఆరోగ్యానికి కాఫీ మేలు చేసేదే అయినప్పటికి దీనిని తక్కువ మోతాదులో మాత్రమే తీసుకోవాలి. రోజుకు 2 నుండి 3 కప్పుల కాఫీని మాత్రమే తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నప్పుడు మనలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి.పొట్టలో కుడివైపున నొప్పి, కళ్లు మరియు చర్మం పసుపు రంగులో మారడం, దురద, కడుపులో వాపు, పాదాలల్లో నీళ్లు చేరడం, మూత్రం పసుపు రంగులో రావడం, అలసట, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు మనలో కనిపిస్తాయి. ఈ లక్షణాలు మనలో కనిపించిన వెంటనే వైద్యున్ని సంప్రదించడం చాలా అవసరం.

# పానీపూరీ: ప్రాణాలకే ప్రమాదమాట?



పానీపూరీ ఎంత రుచిగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ దీనిని ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు.అయితే నేటి కాలంలో చాలా మంది వ్యాపారులు స్వలాభం కోసం అన్నింటిని కల్తీ చేస్తున్నారు.చాలా సార్లు పానీపూరీ విషయంలో కూడా ఇలాంటి ఘోరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పానీపూరీని తయారు చేసే వారు నకిలీ మసాలాలను వాడుతున్నారని అలాగే పానీపూరీలో వేసే నీరు కూడా మురికి నీరు అని కలుషితమైన నీటిని పానీపూరీలో ఉపయోగిస్తున్నారని అలాగే పూరీ తయారీకి వాడే పిండిని కాళ్లతో తొక్కి తయారు చేస్తున్నారని ఇలా చాలా రకాల విషయాలు కూడా మనకు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చాయి. పైగా వీటికి సంబంధించిన వార్తలను ఫోటోలు, వీడియోల రూపంలో ఇప్పటికి మనం సోషల్ మీడియాలో చాలా చూస్తూనే ఉన్నాం.అలాగే పానీపూరీకి సంబంధించిన మరో దారుణమైన విషయం ఒకటి వెలుగులోకి వచ్చింది.ఈ పానీపూరీ నీళ్లల్లో యాసిడ్ కలిపి అమ్ముతున్నారని తాజాగా వెలుగులోకి వచ్చింది.ఎందుకంటే ఆ నీటిలో యాసిడ్ కలపడం వల్ల పానీపూరీ రుచి పెరుగుతుందని దీంతో తరుచూ ప్రజలు పానీపూరీని తినడానికి తమ్మ వద్దకే వస్తారు అనే దురుద్దేశంతో వ్యాపారులు ఇలా దారుణాలు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ఇంకా అలాగే మనం తినే పానీపూరీ నీటిలో యాసిడ్ కలిపారా లేదా అనే విషయాన్ని కూడా చాలా సులభంగా గుర్తించవచ్చని వారు నిపుణులు చెబుతున్నారు. పానీపూరీలో నీటి రంగు అనేది చాలా తేలికగా మారితే వారు నీటిలో యాసిడ్ కలపారని అర్థం. ఇంకా అలాగే స్టీల్ ప్లేట్ లో గనుక పానీపూరీని ఇస్తే ప్లేట్ పై తెల్లటి గుర్తులు కూడా ఏర్పడతాయి. దీనిని బట్టి కూడా నీటిలో యాసిడ్ కలపారని మనం పూర్తిగా అర్థం చేసుకోవచ్చు.ఇంకా అంతేకాకుండా యాసిడ్ కలిపిన పానీపూరీని తినప్పుడు మన దంతాలపై ఒకలాంటి పొర కూడా ఏర్పడుతుంది. ఇంకా అలాగే గొంతులో చికాకు, మంట, కడుపులో నొప్పి వంటి సమస్యలు కూడా మనకు తలెత్తుతాయి.కాబట్టి ఇటువంటి లక్షణాలను ఎవరైనా గుర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ప్రజలను కూడా అప్రమత్తం చేయడం మంచిది. వీటితో పాటు ఎక్కడపడితే అక్కడ ఇటువంటి చిరుతిళ్లను తీసుకోవడం మంచిది కాదని ఇలాంటి నాణ్యతలేని చిరుతిళ్లను తీసుకోవడం వల్ల మనం అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు

# జొన్నరొట్టెలు తినడం వల్ల లాభాలు..!



మన చుట్టూ పండేటువంటి వాటిలో కూడా ఆరోగ్యానికి చాలా మేలు చేసే తృణధాన్యాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా ఈ ధాన్యాల వల్ల మనకు చాలా లాభాలు కూడా ఉంటాయి. అలాంటి వాటిలో జొన్నలు కూడ ఒకటి.చాలా మంది వీటితో రొట్టెలు వంటివి చేసుకుంటూ ఉంటారు. ఎక్కువగా షుగర్ వ్యాధిగ్రహస్తులు కూడా వీటిని తింటూ ఉంటారు. ఈ జొన్నల వల్ల మనం అధిక రక్తపోటు సమస్యలను మలబద్ధకం ఇతరత్తర సమస్యలను కూడా నివారించుకోవచ్చు.జొన్నలు ఎక్కువగా ఆఫ్రికా వంటి ప్రాంతాలలో ఎక్కువగా పండుతాయి. జొన్న పిండితో తయారు చేసిన వంటలను తినడం వల్ల మరిన్ని లాభాలు కలుగుతాయి. ముఖ్యంగా జీర్ణ క్రియ మెరుగుపడడం గుండెపోటు రాకుండా ఉండడం బరువు తగ్గడం వంటి వాటికి ఉపయోగపడుతూ ఉంటాయి. జొన్నలలో ఎక్కువగా ప్రోటీన్ ఫైబర్ వంటివి లభిస్తాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు ఫినాలిక్ సమ్మేళనాలు వంటివి ఈ జొన్నలలో లభిస్తాయి. శరీరంలోని కొండే పేగుల కదలికలను కూడా చురుకుగా చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఫైబర్, గట్ వంటి బ్యాక్టీరియాను అభివృద్ధి చేయడానికి ఈ జొన్నలు సహాయపడతాయి. జొన్నలతో తయారు చేసినటువంటి ఆహారాన్ని తినడం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. శరీరంలో ఉండే వ్యర్థ కొవ్వు పదార్థాలను నియంత్రించడానికి చాలా సహాయపడతాయి. జొన్న లో ఉండే ఫినాలి యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉండేటువంటి మంట అధిక ఒత్తిడిని సైతం తగ్గించడానికి సహాయపడతాయి. ముఖ్యంగా జొన్న రొట్టెలను తినడం వల్ల అధిక బరువు సమస్య నుంచి బయటపడవచ్చు ఇందులో ఉండే ఫైబర్ ప్రోటీన్ ల వల్ల ఎక్కువ లాభాలు ఉంటాయి. కాబట్టి ఐదు సంవత్సరాల పైబడిన పిల్లలు కూడా వీటిని తినడం మరింత మంచిది. జొన్న రొట్టెలు కాల్చేటప్పుడు కాస్త నువ్వు గింజలు కూడా రొట్టెల మీద చల్లుకొని తినడం వల్ల మరింత టేస్ట్ గా ఉంటాయి. వీటితోపాటు మరిన్ని పోషకాలు కూడా లభిస్తాయట.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



# స్థానిక వార్తలు

## ఐటి కంపెనీల రెవెన్యూలో స్తబ్దత



**న్యూఢిల్లీ :** భారత ఐటి కంపెనీల రెవెన్యూలో స్తబ్దత చోటు చేసుకోనుందని ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ క్రిసిల్ అంచనా వేసింది. అమెరికా, యూరప్ లాంటి అంతర్జాతీయ సూక్ష్మ గణంకాల్లో నెలకొన్న ఒత్తిడి ఐటి కంపెనీలపై ప్రతికూల ప్రభావాన్ని చూపనుందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఏడాదికేడాదితో పోల్చితే రెవెన్యూలో 57 శాతం పెరుగుదల ఉండొచ్చని పేర్కొంది. గడిచిన 2023-24లో 6 శాతం లోపు వృద్ధి చోటు చేసుకుందని పేర్కొంది. గత దశాబ్ద కాలంలో సగటున 12 శాతం వృద్ధి నమోదయ్యింది. దీంతో పోల్చితే వరుసగా రెండేళ్ల పాటు ఐటి రంగం ఒత్తిడిని ఎదుర్కొనుందని క్రిసిల్ పేర్కొంది. అమెరికా, యూరప్ మార్కెట్లలో ఐటిపై వ్యయాలు తగ్గించుకోవడమే ప్రధాన కారణమని తెలిపింది.

## హైదరాబాద్‌లో కంట్రోల్ఎస్ మూడో డేటా సెంటర్



**హైదరాబాద్:** ఆసియాలోనే అతిపెద్దదైన, రేటెడ్- 4 డేటా కేంద్రాల నిర్వహణ సంస్థ, కంట్రోల్ఎస్ డేటాసెంటర్స్ లిమిటెడ్, హైదరాబాద్‌లో మూడో డేటా సెంటర్‌ను (డీసీ 3) ఏర్పాటు చేస్తోంది. ఐటీ, ఆర్థిక రంగ సంస్థలకు కేంద్రస్థానంగా ఉన్న గచ్చిబౌలి 'ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్'లో ఈ కేంద్రాన్ని రెండు, మూడు నెలల్లో ప్రారంభిస్తామి సంస్థ తెలిపింది. దాదాపు 1.34 లక్షల చదరపు అడుగుల నిర్మాణ స్థలం గల, 5 అంతస్తుల భవనంలో 13 మెగావాట్ల ఐటీ లోడ్ సామర్థ్యంతో దీన్ని సిద్ధం చేస్తున్నారు. 9 వరసల భద్రతా వలయం, అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీ, క్లౌడ్ కనెక్ట్ సర్వీసెస్, ఇంటర్నెట్ ఎక్స్ఛేంజీ ప్రొవైడర్లతో అనుసంధానించి ఉండటం దీని ప్రత్యేకతలు వెల్లడించింది. కంట్రోల్ఎస్ హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, గచ్చిబౌలిల్లో ఇప్పటికే 2 డేటా సెంటర్లు నిర్వహిస్తోంది. ముంబయి, చెన్నై, బెంగళూరు, నోయిడాల్లోనూ కంట్రోల్ఎస్ డేటా కేంద్రాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 250 మెగావాట్ల డేటా సెంటర్ల సామర్థ్యం ఈ సంస్థకు ఉంది. పట్నా, కోల్‌కతా, లఖ్‌నవూ తదితర ద్వితీయ శ్రేణి నగరాల్లో ఎడ్జ్ డేటా కేంద్రాలు నిర్వహిస్తోంది. క్లౌడ్ సర్వీస్ సంస్థలు, డిజాస్టర్ రికవరీ సేవలు అందించే సంస్థలు అధికంగా ఉన్నందున హైదరాబాద్ నగరం డేటా కేంద్రాలకు కేంద్రస్థానంగా మారుతోందని కంట్రోల్ఎస్ డేటాసెంటర్స్ సీఈఓ శ్రీధర్ పిన్నపురెడ్డి తెలిపారు. సామర్థ్యాన్ని పెంచుకునేందుకు, ఇంతకు ముందు ప్రకటించిన 2 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లో మూడో డేటా కేంద్రాన్ని నెలకొల్పుతున్నట్లు వివరించారు.

# కొటాక్ మహీంద్రాకు భారీ షాక్



**న్యూఢిల్లీ :** ప్రయివేటు రంగంలోని కొటాక్ మహీంద్రా బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ భారీ షాక్ ఇచ్చింది. క్రెడిట్ కార్డుల జారీని తక్షణం నిలిపి వేయాలని బుధవారం ఆదేశించింది. అదే విధంగా ఆన్‌లైన్, మొబైల్ బ్యాకింగ్ పద్ధతుల్లో కొత్త ఖాతాదారులను చేర్చుకోవడానికి వీలు లేదని స్పష్టం చేసింది. కొటక్ మహీంద్రా బ్యాంక్ ఐటి రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్‌లో లోపాలను గుర్తించడంతో ఆర్‌బిఐ చర్యల తీసుకుంది. ఆర్థిక సంవత్సరం 2022-23లో ఐటి ఆడిట్‌లో గుర్తించిన లోపాల ఆధారంగా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఆయా లోపాలు, సమస్యలను పరిష్కరించడంలో బ్యాంక్ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. బ్యాంక్ ఐటి ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్, ప్యాచ్ అండ్ ఛేంజ్ మేనేజ్‌మెంట్, యూజర్ యాక్సెస్ మేనేజ్‌మెంట్, వెండర్ రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా సెక్యూరిటీ, డేటా లీక్‌లను ప్రివెన్షన్ ఎత్తుగడలు లోపభూయిష్టంగా ఉన్నాయని కేంద్ర బ్యాంక్ తెలిపింది. ముఖ్యంగా ఐటి రిస్క్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గవర్నెన్స్ విషయంలో రెండు సంవత్సరాలుగా మార్గదర్శకాలు పాటించ లేదని గుర్తించినట్లు పేర్కొంది. ఇకపై బ్యాంకు ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ ఛానెల్స్ ద్వారా కొత్త ఖాతాదారులను చేర్చుకోవడంతో పాటు కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేయడం నిలిపివేయాలని ఆదేశించినట్లు పేర్కొంది. కాగా.. ప్రస్తుతం ఉన్న క్రెడిట్ కార్డు వినియోగదారులతో పాటు ఇతర వినియోగదారులకు గతంలో మాదిరిగానే సేవలు అందించవచ్చని తెలిపింది. ఆర్‌బిఐ నుంచి ముందస్తు అనుమతితో కొటాక్ మహీంద్రా బ్యాంక్‌లో సమగ్ర ఆడిట్ నిర్వహించాల్సి ఉంటుంది. దాన్ని రిజర్వ్ బ్యాంక్ సమీక్షించి, ఆ బ్యాంకు చేపట్టిన చర్యలపై సంతృప్తి చెందితే ఆంక్షల ఎత్తివేతపై నిర్ణయం తీసుకుంటుంది. 2020లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌పైనా ఆర్‌బిఐ ఈతరహా ఆంక్షలనే విధించింది. క్రెడిట్ కార్డుల జారీని నిలిపివేసింది. 2021 ఆగస్టులో ఆంక్షలు ఎత్తి వేసింది.

# సొంతంగా ఐటీఆర్ దాఖలు చేయాలనుకుంటున్నారా?



ఇన్ కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేయడానికి తుది గడువు సమీపిస్తోంది. అసెస్‌మెంట్ ఇయర్ 2024-25 లేదా ఆర్థిక సంవత్సరం 2023-24కి సంబంధించిన ఆన్ లైన్ ఐటీఆర్ ఫైలింగ్ ను ఆదాయ పన్ను శాఖ ఇప్పటికే ప్రారంభించింది. ముఖ్యంగా ప్రతి నెల జీతం పొందే వ్యక్తులు తమ ఐటీఆర్ ను ఫైల్ చేయడానికి ఫారం 16 కోసం వేచి ఉన్నారు. అయితే వారు ఈ ఫారం లేకుండా కూడా ఐటీఆర్ ఫైల్ చేసే అవకాశం ఉంది. పన్ను చెల్లింపు దారులు తమ సొంతంగా కూడా రిటర్న్ లను ఫైల్ చేసే అవకాశం ఉంది. మీరు కనుక అకౌంటెంట్ లేదా ఫైనాన్షియర్ అడ్వైజర్ సహాయం లేకుండా ఐటీఆర్ ఫైల్ చేయాలనుకునేవారు కొన్ని అంశాలను తప్పక తెలుసుకోవాలి. అవేంటో ఇప్పుడు చూద్దాం.. పన్ను రిటర్న్ ఫైల్ చేసేవారు సరైన ఐటీఆర్ ని ఎంచుకోవాలి. ఐటీఆర్ 1 అనేది వ్యాపార ఆదాయం లేని పన్ను దాఖలు చేసేవారికి సరళమైన ఫారమ్, అయితే ఐటీఆర్ 4 అనేది ఊహాజనిత పన్నును ఎంచుకునే పన్ను ఫైల్ చేసేవారికి వర్తించే సరళమైన ఫారమ్. అదే సమయంలో సరళీకృత ఫారమ్‌ల కోసం అనేక నిర్బంధ షరతులు ఉన్నాయి. ఆ షరతుల ఉల్లంఘన కారణంగా ఐటీఆర్-1 వర్తించకపోతే, మీరు ఐటీఆర్-2 (వ్యాపార ఆదాయం లేదు) లేదా ఐటీఆర్-3 (వ్యాపార ఆదాయం) సమర్పించవలసి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం 2023-24 కు సంబంధించిన ఐటీఆర్ దాఖలు చేసేందుకు 2024, జూలై 31 నాటికి, అలాగే ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించిన ఐటీఆర్ దాఖలు చేయడానికి జూలై 2025నాటికి ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. పన్ను చెల్లింపుదారులు పాత పన్ను విధానాన్ని లేదా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే అవకాశం ఉంది. డిఫాల్ట్ పథకం కొత్త పన్ను విధానం. కొత్త పన్ను విధానంలో, నివాసి వ్యక్తి (నికర ఆదాయం రూ. 7 లక్షలకు మించని వ్యక్తి) సెక్షన్ 87ఏ కింద రాయితీని పొందవచ్చు. రాయితీ మొత్తం ఆదాయపు పన్నులో 100 శాతం లేదా రూ. 25,000 ఏది తక్కువైతే అది. పాత పన్ను విధానంలో, నివాసి వ్యక్తిగత పన్ను చెల్లింపుదారు (నికర ఆదాయం రూ. 5 లక్షల వరకు ఉంటుంది) సెక్షన్ 87ఏ కింద రాయితీని పొందవచ్చు. రాయితీ మొత్తం ఆదాయపు పన్నులో 100 శాతం లేదా రూ. 12,500, ఏది తక్కువైతే అది ఉంటుంది. అంతేకాకుండా, డిఫాల్ట్ విధానంలో పన్ను చెల్లింపుదారులకు వారి మొత్తం ఆదాయం రూ. 7 లక్షలు దాటితే, మొత్తం ఆదాయంపై చెల్లించాల్సిన ఆదాయపు పన్ను మొత్తం ఆదాయం రూ. 7 లక్షలకు మించి ఉంటే వారికి స్వల్ప ఉపశమనం లభిస్తుంది.

# నేపాల్ క్రికెట్ బోర్డు పేదరికం.. విండీస్ క్రికెటర్లకు ఊహించని కష్టాలు



ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం వెస్టిండీస్-ఏ క్రికెట్ జట్టు నేపాల్‌లో పర్యటిస్తుంది. ఈ నెల (ఏప్రిల్) 27 నుంచి వచ్చే నెల (మే) 4వ తేదీ వరకు జరిగే ఈ పర్యటనలో విండీస్-నేపాల్ జట్లు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనున్నాయి. కిరీటీపూర్ వేదికగా జరిగే ఈ సిరీస్ ఏప్రిల్ 27, 28, మే 1, 2, 4 తేదీల్లో జరుగనుంది. విండీస్ క్రికెట్ బోర్డు నేపాల్ సిరీస్‌ను వరల్డ్‌కప్ సన్నాహకంగా భావించి పూర్తి స్థాయి జట్టును అక్కడికి పంపింది. ఐపీఎల్‌తో బిజీగా ఉ?న్న క్రికెటర్లు మినహా మిగతా జట్టంతా నేపాల్ పర్యటనకు వచ్చింది. విండీస్ క్రికెటర్లు నిన్ననే నేపాల్ రాజధాని ఖాట్మండులో ల్యాండ్ అయ్యారు. అయితే ఖాట్మండు విమానాశ్రయంలో విండీస్ క్రికెటర్లకు ఊహించని కష్టాలు ఎదురయ్యాయి. నేపాల్ క్రికెట్ బోర్డు విండీస్ క్రికెటర్లకు కనీస సదుపాయాలు కూడా కల్పించలేకపోయింది. అంతర్జాతీయ స్థాయి మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్లుకు స్వాగతం పలికే నాథుడు కూడా లేకుండా పోయాడు. నిధులలేమితో కొట్టిమిట్టాడుతున్న నేపాల్ క్రికెట్ బోర్డు విండీస్ క్రికెటర్లకు కనీస రవాణా సదుపాయాలు కూడా కల్పించలేకపోయింది. క్రికెటర్లు సాధారణ బస్సులో బస చేసే ప్రదేశానికి బయల్దేరారు. నేపాల్ క్రికెట్ బోర్డు దీనస్థితి ఎంతలా ఉందంటే.. విండీస్ క్రికెటర్ల లగేజీని మోసుకెళ్లేందుకు ట్రాలీ ఆటో లాంటి అతి సాధారణ రవాణా సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. విండీస్ ఆటగాళ్లు ఎవరి లగేజీని వాళ్లే మోసుకెళ్లి ట్రాలీలో పెట్టుకున్నారు. ఈ మొత్తం తంతుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరలవుతుంది. కొందరు నేపాల్ క్రికెట్ బోర్డు పరిస్థితిని చూసి జాలి పడుతుంటే.. మరికొందరు మీమ్స్‌కు వాడుకుంటున్నారు. కాగా, వెస్టిండీస్ క్రికెట్ బోర్డు పరిస్థితి కూడా గతంలో నేపాల్ క్రికెట్ బోర్డు పరిస్థితి మాదిరే ఉండేది. ఆ జట్టు క్రికెట్ బోర్డు కూడా పేదరికంతొ కొట్టిమిట్టాడింది. ప్రస్తుతం పరిస్థితుల్లో కొద్దిగా మార్పు వచ్చింది. విండీస్ క్రికెట్ బోర్డుకు ఎలాగోలా నిధులు సమకూరుతున్నాయి. అందుకే ఆ జట్టు యూఎస్ఏతో కలిసి ఈ ఏడాది టీ20 వరల్డ్‌కప్‌కు ఆతిథ్యమివ్వగలుగుతుంది. నేపాల్ క్రికెట్ బోర్డు విషయానికొస్తే.. ఆ దేశ క్రికెట్ బోర్డు ఆటగాళ్లకు జీతాలు ఇవ్వలేకపోతుంది. కనీసం? కిట్లు కూడా సమకూర్చలేకపోతుంది. దీనస్థితిలో ఉన్న నేపాల్ క్రికెట్‌ను బీసీసీఐ లాంటి సంపన్న బోర్డులు ఆదుకోవాలి. నేపాల్‌లో పర్యటిస్తున్న వెస్టిండీస్-ఏ క్రికెట్ జట్టు: రోస్టన్ ఛేజ్ (కెప్టెన్), అలిక్ అథనాజ్ (వైస్ కెప్టెన్), ఫాబియన్ అలెన్, కడీమ్ అలీన్, జాషువా బిషప్, కీసీ కార్టీ, జాన్సన్ చార్లెస్, మార్క్ దేయల్, ఆండ్రీ ఫ్లెచర్, మాథ్యూ ఫోర్డ్, ఒబెడ్ మెకాయ్ , గుడకేష్ మోటీ, కీమో పాల్, ఒషానే థామస్, హేడెన్ వాల్ష్

## ఢిల్లీ క్యాపిటల్స్ యువ పేసర్‌కు బీసీసీఐ మందలింపు



ఢిల్లీ క్యాపిటల్స్ యువ పేసర్ రసీఖ్ సలాం దర్‌ను బీసీసీఐ మందలించింది. ఐపీఎల్-2024లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో అతి చేసినందుకు వార్నింగ్ ఇచ్చింది. ఇంకోసారి ఇలాంటివి పునరావృతం చేయకూడదని హెచ్చరించింది. కాగా ఢిల్లీ వేదికగా టైటాన్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో రసీఖ్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. నాలుగు ఓవర్ల బౌలింగ్ కోటా పూర్తి చేసిన ఈ రైటార్మ్ పేసర్ 44 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు తీశాడు. సాయి సుదర్శన్(39 బంతుల్లో 65), షారుఖ్ ఖాన్(8), రవిశ్రీనివాసన్ సాయి కిషోర్(13)లను అవుట్ చేశాడు. ముఖ్యంగా లక్ష్య ఛేదనలో ప్రమాదకారిగా మారుతున్న సాయి సుదర్శన్‌ను పెవిలియన్‌కు పంపడం ద్వారా రసీఖ్ మ్యాచ్‌ను ఢిల్లీ వైపు తిప్పాడు. అలా ఢిల్లీ విజయంలో తన వంతు పాత్ర పోషించాడు 24 ఏళ్ల ఈ కశ్మీరీ ఎక్స్‌ప్రెస్. అయితే, వికెట్ తీసిన ప్రతిసారీ రసీఖ్ కాస్త వైల్డ్‌గా సెలబ్రేట్ చేసుకున్నాడు. దీంతో బీసీసీఐ అతడిని మందలించింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గానూ ఈమేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. కాగా అరుణ్ జైట్లీ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ గుజరాత్‌పై 4 పరుగుల తేడాతో గట్టెక్కింది. టాస్ గెలిచిన గుజరాత్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. అయితే, లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆఖరి బంతి వరకు పోరాడినా ఫలితం లేకుండా పోయింది. ఎనిమిది వికెట్లు నష్టపోయి 220 పరుగుల వద్ద నిలిచి ఓటమి పాలైంది.

# స్పోర్ట్స్

## రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ క్రికెటర్.. 17 ఏళ్ల కెరీర్‌కు గుడ్ బై



పాకిస్తాన్ మహిళా జట్టు మాజీ కెప్టెన్ బిస్మా మరూఫ్ సంచలన నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు బిస్మా మరూఫ్ రిటైర్మెంట్ ప్రకటించింది. తన నిర్ణయాన్ని మరూఫ్ సోషల్ మీడియా వేదికగా గురువారం వెల్లడించింది. "నేను చాలా ఇష్టపడే ఆట(క్రికెట్) నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. నా 17 ఏళ్ల ప్రయాణం ఎన్నో సవాళ్లు, విజయాలు, మధురమైన జ్ఞాపకాలతో నిండి ఉంది. నా క్రికెట్ ప్రయాణంలో అరంగేట్రం నుంచి ఇప్పటి వరకు నాకు మద్దతుగా నిలిచిన అందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నాపై నమ్మకం ఉంచి, జట్టును నడిపించే బాధ్యతను తనకు అప్పగించినందుకు పీసీబీకి ప్రత్యేక ధన్యవాదాలు. చివరగా నా దేశానికి అత్యున్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందని" బిస్మా పేర్కొన్నట్లు పీసీబీ ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా 2006లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మరూఫ్ 17 ఏళ్ల పాటు పాకిస్తాన్ క్రికెట్‌కు తన సేవలు అందించింది. పాకిస్తాన్ మహిళ క్రికెట్ జట్టు తరపున వన్డేలు, టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఇప్పటికి మరూఫ్ పేరునే ఉంది. ఆమె పాక్ తరపున 136 వన్డేల్లో 3369 పరుగులతో పాటు 44 వికెట్లు, 146 టీ20ల్లో 2893 పరుగులతో పాటు 36 వికెట్లు పడగొట్టింది. 96 మ్యాచ్‌ల్లో పాక్ జట్టుకు కెప్టెన్‌గా మరూఫ్ వ్యవహరించింది. మరూఫ్ చివరగా స్వదేశంలో వెస్టిండీస్ మహిళలతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో పాక్ జట్టు తరపున ఆడింది. విండీస్‌తో టీ20 సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో కూడా మరూఫ్ భాగమైంది. కానీ ఈ సిరీస్‌లో ఆడుతారా లేదా అన్నది ఇంకా క్లారిటీ లేదు.

# ఈ తెలుగునటి ఒకప్పుడు సల్మాన్ ఖాన్ హీరోయిన్



అగ్ర దర్శకుడు రాజమౌళి దర్శకత్వం వహించిన 'మర్యాద రామన్న' అంటే ఠక్కున గుర్తుకు వచ్చేది ఆ సినిమాలో కథానాయకురాలు సలోని. ఆ సినిమాలో సునీల్ కథానాయకుడు, ఇంకో ప్రధాన పాత్రలో బ్రహ్మాజీ కనిపిస్తారు. ఈ సినిమా పెద్ద విజయం సాధించటమే కాకుండా, ఇందులో నటించిన సలోని నటనని అందరూ ప్రశంసించారు. సలోని అసలు పేరు వందన అని ఎంతమందికి తెలుసు. ముంబైలో పుట్టి పెరిగిన ఆమె ముందుగా హిందీ సినిమా ' దిల్ పరదేశి హెూ గయా' తో ఆరంగేట్రం చేసింది. తర్వాత 'ధన 51' తో తెలుగులోకి అడుగుపెట్టింది. ఇందులో సుమంత్ కథానాయకుడు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర అంతగా నడవలేదు. ఈ సినిమా తర్వాత తరుణ్ పక్కన 'ఒక వూరిలో' అనే సినిమా చేసింది సలోని, ఈ సినిమా కూడా విజయం సాధించలేదు. సిద్ధార్థ్ తో చేసిన 'చుక్కలో చంద్రుడు' పరవాలేదు అనిపించింది. ఇలా వరసగా తెలుగు సినిమాలు చేస్తున్న సలోని కి హిందీలో సల్మాన్ ఖాన్ పక్కన చేసే అవకాశం వచ్చింది. 'సావన్: ది లవ్ సీజన్' అనే హిందీ సినిమాలో సల్మాన్ ఖాన్ ప్రేయసిగా చేసి అందరి ప్రసంశలు అందుకుంది సలోని. ఎందుకో ఆమె కెరీర్ హిందీలో అంతగా సాగలేదు. ఆ తర్వాత తమిళ్, కన్నడ సినిమాలు చేసి అక్కడ మంచి పేరు సంపాదించింది. అప్పుడు ఎస్ఎస్ రాజమౌళి తన 'మగధీర' సినిమాలో సలోని కి ఒక చిన్న పాత్ర ఇచ్చారు. రామ్ చరణ్, కాజల్ అగర్వాల్ జంటగా నటించిన ఈ సినిమా అప్పట్లో ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. సలోని చేసిన చిన్న పాత్రకే మంచి ప్రసంశలు రావటంతో, రాజమౌళి ఆమెని తన తదుపరి సినిమా 'మర్యాద రామన్న'లో కథానాయకురాలిగా అవకాశం ఇచ్చారు. ఆ సినిమా పెద్ద హిట్ అయింది. ఆ తరువాత అడపా తడపా సినిమాలు చేస్తూనే వుంది సలోని, కానీ పెద్ద బ్రేక్ అయితే మాత్రం ఆమెకి రాలేదు అనే చెప్పాలి. వెంకటేష్ పక్కన నటించిన 'బాడీ గార్డ్' సినిమాలో సలోని చేసిన నటనకి బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్ గా సైమా అవార్డు వచ్చింది.

# ఎమోషనల్ కామెంట్స్ చేసిన ఇలియానా



తెలుగు ప్రేక్షకులకు ఇలియానా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. దేవదాసు సినిమాతో సినీ ఇండస్ట్రీకి పరిచయమైన ఈ ముద్దుగుమ్మ పోకిరి సినిమాతో స్టార్ హీరోయిన్గా గుర్తింపు తెచ్చుకుంది. పోకిరిసినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మకి వరుస సినిమాల్లో స్టార్ హీరోల సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుంది. అలా ఇప్పటివరకు టాలీవుడ్ లో ఉన్న దాదాపుగా అందరూ స్టార్ హీరోలు సరసన నటించిం ది. ఈ నేపథ్యంలోనే కెరియర్ సాఫీగా సాగుతున్న సమయంలో బాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చింది. అలా టాలీవుడ్ ని విడిచి వెళ్లడంతో ఇలియానా కెరియర్ డౌన్ అయిపోయింది.ఇకపోతే ఇలియానా కంటే ముందు వచ్చిన త్రిష శ్రేయా వంటి స్టార్ హీరోయిన్లు ఎప్పటికీ హీరోయిన్లుగా రాణిస్తున్నారు. కానీ ఇలియానా మాత్రం టాలీవుడ్ ని వదిలి బాలీవుడ్ కి వెళ్లడంతో టాలీవుడ్ లో తన క్రేజ్ మొత్తం పడిపోయింది. అంతేకాదు అప్పట్లో ఇలియానాకి సంబంధించిన ప్రేమ వ్యవహారాలు టాలీవుడ్ ని ఒక ఊపు ఊపేసాయి. బ్రేకప్ ల వల్ల ఎంతో కృంగిపోయిన ఇలియానా ఒక ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫర్ ని ప్రేమించింది కొంతకాలం కలిసే ఉన్నప్పటికీ ఇద్దరికీ బ్రేకప్ కావడంతో డిప్రెషన్ లోకి వెళ్లిన ఇలియానా తిరిగి కోలుకొని మరొక వ్యక్తిని ప్రేమించి ఒక బిడ్డకు తల్లి కూడా అయింది. ప్రస్తుతం తన భర్త కొడుకుతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం కొడుకు, భర్తతో హ్యాపీగా ఉన్న సమయంలో ఇలియానా చేసిన ఎమోషనల్ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. ఇలియానా అప్పుడప్పుడూ ఆఫర్స్ అందుకుంటూ సినిమాల్లో నటిస్తోంది. ఇలియానా నటించిన లేటెస్ట్ మూవీ దో ఔర్ దో ప్యార్ చిత్రానికి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇలియానా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఈ ఇంటర్వ్యూలో ఇలియానా చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

# నేషనల్ క్రష్ తర్వాత ఈమె పేరే వినిపిస్తోంది!

'యానిమల్' సినిమాతో జాతీయ స్థాయిలో మంచి పేరు సంపాదించుకున్న నటి రష్మిక మందన్న. అంతకు ముందు ఆమె చేసిన 'పుష్ప' సినిమా హిందీలో పెద్ద విజయం సాధించటంతో ఆమె పేరు ఒక్కసారిగా మారుమోగింది, ఆమె 'నేషనల్ క్రష్' అయింది. ఇప్పుడు నేషనల్ క్రష్ తరువాత దక్షిణాదికి చెందిన ఇంకో నటి పేరు జాతీయ స్థాయిలో మారుమోగుతోంది. ఆమె మరెవరో కాదు ప్రియమణి. ఎప్పుడో 21 సంవత్సరాల క్రితం 2003లో 'ఎవరే అతగాడు' అనే తెలుగు సినిమాతో చిత్రసీమలోకి ఆరంగేట్రం చేసిన ప్రియమణి తర్వాత 2007లో వచ్చిన తమిళ సినిమా 'పరుత్తివీరన్' లో కార్తీ పక్కన నటించి అందులో ఆమె చేసిన నటనకి గాను జాతీయ ఉత్తమ నటి అవార్డు తీసుకొని తన ప్రతిభా పాటవాలను చాటి చెప్పింది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం సినిమాలో తనదైన శైలిలో నిరూపించుకున్న ప్రియమణి మొదటిసారిగా 'రావణ్' సినిమాతో 2010లో హిందీలోకి ఆరంగేట్రం చేసింది. మణిరత్నం ఈ సినిమాకి దర్శకుడు. ఇందులో బాలీవుడ్ కి చెందిన అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్, గోవిందా లతో పాటు తమిళ సూపర్ స్టార్ విక్రమ్ కూడా నటించారు. ఈ సినిమాతో హిందీలో కూడా తన పేరు నమోదు చేసుకుంది ప్రియమణి. మొదటి సినిమా ఆరంగేట్రం నుంచి ఈరోజు వరకు ప్రియమణి ఎక్కడా బ్రేక్ లేకుండా వరసగా సినిమాలు చేసుకుంటూ వస్తూనే వుంది. చాల తక్కువమంది నటీమణులు ఇలా ఇన్నేళ్ళపాటు వరసగా కెరీర్ లో ఎక్కడా బ్రేక్ లేకుండా సినిమాలు చేసుకుంటూ రావటం. అదీ కాకుండా ఒక తెలుగులోనే కాకుండా, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో తనకు నచ్చిన పాత్రలు చేసుకుంటూ ముందుకు సాగుతోంది ప్రియమణి. ఉత్తమనటిగా జాతీయ అవార్డుతో పాటు ఫిల్మ్ ఫేర్ అవార్డులు, ఇతర రాష్ట్ర అవార్డులు ఎన్నో గెలుచుకుంది. ఈమధ్యనే తెలుగులో 'భామా కలాపం 2' అనే వెబ్ సినిమా చేసి అక్కడ విజయం సాధిచింది. జాతీయ స్థాయిలో 'ఆర్టికల్ 370' సినిమాలో ఐఏఎస్ అధికారి రాజేశ్వరిగా తనదైన శైలిలో నటించి ప్రేక్షకులని ఎంతగానో మెప్పించింది. అలాగే ఇంకో హిందీ సినిమా 'మైదాన్' లో కూడా ఒక మంచి పాత్ర పోషించి జాతీయ స్థాయిలో ఇప్పుడు ప్రియమణి పేరు మారుమోగుతోంది అంటే ఆమె చేస్తున్న కృషి, తాను చేస్తిన్న పాత్రల పట్ల అంకితభావం, తన నటనతో అందరినీ మెప్పించడం.



# దానిలో ఇంత మీనింగ్ ఉందా?



తెలుగు సినీ పరిశ్రమలో మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ నటిగా పేరు తెచ్చుకున్న వారిలో ఫరియా అబ్దుల్లా ఒకరు. ఈమె నవీన్ పోలిశెట్టి హీరోగా ప్రియదర్శి , రాహుల్ రామకృష్ణ కీలక పాత్రలలో అనుదీప్ కేవీ దర్శకత్వంలో రూపొందిన జాతి రత్నాలు సినిమాలో నవీన్ పోలిశెట్టి కి జంటగా నటించి మంచి గుర్తింపును సంపాదిం చుకుంది. ఈ సినిమాలో చిట్టి పాత్రలో నటించిన ఈమె తన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక ఆ తర్వాత ఈమెకు తెలుగులో పర్వాలేదు అనే స్థాయి క్రేజ్ ఉన్న ఎన్నో సినిమాలలో అవకాశాలు దక్కాయి. అందులో భాగంగా ఇప్పటికే చాలా సినిమాల్లో నటించి తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్ ను టాలీవుడ్ ఇండస్ట్రీ లో దక్కించుకుంది. ఇది ఇలా ఉంటే తాజాగా ఈ బ్యూటీఅల్లరి నరేష్ హీరోగా రూపొందిన ఆ ఒక్కటి అడక్కు అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఈ మూవీ మరికొన్ని రోజుల్లోనే విడుదల కాబోతోంది. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడడంతో ఈ బ్యూటీ వరుస ఇంటర్వ్యూలలో , టీవీ షో లలో పాల్గొంటూ ఈ సినిమాను ఫుల్ గా ప్రమోట్ చేస్తూ వస్తుంది. అందులో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పరియా తన టాటూ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను చెప్పుకొచ్చింది.



# స్టార్ హీరో సినిమాలో శ్రీలీల ఐటమ్ సాంగ్?

దర్శకుడు వెంకట్ ప్రభు చిత్రం అంటే చాలా ప్రత్యేకతలు ఉంటాయి. ముఖ్యంగా నటీనటులు ఎక్కువగా ఉంటారు. సాంకేతిక విలువలకు ప్రాముఖ్యత ఉంటుంది. గోట్ చిత్రంలోనూ ఇవి కొనసాగుతున్నాయని చెప్పవచ్చు. నటుడు విజయ్ నటిస్తున్న చివరి చిత్రానికి ముందు చిత్రం గోట్. దీని తరువాత తన 69వ చిత్రం చేసి విజయ్ నటనకు స్వస్తి పలకనున్నారనే టాక్ చాలా కాలంగా జరుగుతున్న విషయం తెలిసిందే. వెంకట్ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థ భారీ ఎత్తున నిర్మిస్తోంది. నటి మీనాక్షి చౌదరి, స్నేహ, లైలా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, వైభవ్, ప్రేమ్‌జీ, మైక్ మోహన్ తదితరు లు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. గోట్ చిత్రాన్ని సెప్టెంబర్ 5వ తేదీన వినాయక చతుర్థి సందర్భంగా విడుదల చేయనున్నట్లు యూనిట్ వర్గాల సమాచారం. కాగా ఇందులో నటి త్రిష ప్రత్యేక పాత్రలో మెరవనున్నట్లు ఇంతకు ముందు ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడా స్పెషల్ అప్పీరియన్స్‌ను ఇవ్వడానికి టాలీవుడ్ క్రేజీ నటి శ్రీలీలతో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఇందులో ఈమెకు ప్రత్యేకంగా ఒక పాట కూడా ఉంటుందని తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడలేదన్నది గమనార్హం. ఇదే గనుక నిజం అయితే శ్రీలీల కోలీవుడ్ ఎంట్రీ చిత్రం గోట్‌నే అవుతుంది. కాగా ఈ అమ్మడు మరో టాప్‌స్టార్ అజిత్‌తో జత కట్టడానికి రెడీ అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో శ్రీలీల కోలీవుడ్‌పై దండెత్తబోతున్నారన్నమాట. చూద్దాం ఇక్కడ ఈమె ప్యూచర్ ఎలా ఉండబోతోందో.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com